విశాలాంధ్ర

కృష్ణా, ఎన్టీఆర్ గుంటూరు, పల్నాడు

మంగళవారం 23 సెప్టెంబరు 2025 8 పేజీలు

96 మందితో

దసరా సేవా కమిటీ

-ఇంద్రకీలాద్రిపై శరన్నవరాత్రి వేడుకల కోసం ప్రత్యేకంగా నియామకం

-అందరూ మంత్రులు, ఎంపీ, ఎమ్మెల్యేలు సిఫార్సు చేసిన కూటమి నాయకులే

విశాలాంధ్ర-విజయవాడ (వన్ టౌన్): ఇంద్రకీలాద్రిపై దుర్గగుడిలో దసరా శరన్నవరాత్రి వేడుకల సందర్భంగా జంబో సేవా కమిటీని నియమించారు. మొత్తం -మిగతా 2 లో ...

ఉపరాష్ట్రపతి పర్యటనకు పకడ్బందీ ఏర్పాట్లు

24న దుర్గమ్మ దర్శనం... సిఆర్‌పిఎఫ్ డీఐజీ కమలేష్ సింగ్

విశాలాంధ్ర బ్యూరో మచిలీపట్నం/గన్నవరం : కృష్ణా జిల్లాలో ఈ నెల 24న ఉపరాష్ట్రపతి సిపి. రాధాకృష్ణన్ పర్యటిస్తున్న సందర్భంగా పర్యటనలో ఎలాంటి లోటుపాట్లు లేకుండా అధికారులు సమన్వయంతో పకడ్బందీగా చేయాలని సంపూర్ణ పర్యవేక్షణ అధికారి, సిఆర్‌పిఎఫ్ డిఐజి కమలేష్ సింగ్ అధికారులను ఆదేశించారు. సోమవారం ఉదయం డిఐజి నేతృత్వంలో జిల్లా కలెక్టర్ డీకె. బాలాజీ, రాష్ట్ర ఇంటలిజెన్స్ భద్రత విభాగం డిఐజి హఫీజ్, గన్నవరం విమానాశ్రయం డైరెక్టర్ ఎంఎల్‌కె. రెడ్డి కలిసి గన్నవరం అంతర్జాతీయ విమానాశ్రయంలో సంబంధిత అధికారులతో ముందస్తు భద్రత ఏర్పాట్లపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఉపరాష్ట్రపతి రాకపోకలు, స్వాగత కార్యక్రమాలపై చర్చించి విమానాశ్రయంలో ఏర్పాట్లును పరిశీలించారు. ఉపరాష్ట్రపతి -మిగతా 2 లో ...

నేటి అలంకారం శ్రీ గాయత్రిదేవి

విశాలాంధ్ర-విజయవాడ (వన్‌టౌన్): శరన్నవరాత్రి ఉత్సవాల్లో శ్రీకనకదుర్గమ్మవారు గాయత్రీదేవిగా దర్శనమిస్తారు. సకల మంత్రాలకీ మూలమైన శక్తిగా, వేదమాతగా ప్రసిద్ధిపొంది ముక్తా, విద్రుమ, హేమ, నీల, ధవళ వర్ణాలతో ప్రకాశిస్తూ పంచముఖాలతో దర్శనమిచ్చే సంధ్యావందన దేవత గాయత్రీదేవి. ఈతల్లి శిరస్సుయందు బ్రహ్మ, హృదయమందు విష్ణువు, శిఖయందు రుద్రుడు నివసిస్తుండగా త్రిమూర్త్యాంశగా గాయత్రీదేవి వెలుగొందుతున్నది. సమస్త దేవతామంత్రాలకీ గాయత్రీమంత్రంతో అనుబంధం ఉంది. గాయత్రీమంత్రంతో సంప్రోక్షణ చేసిన తరువాతే ఆయా దేవతలకు అన్నాదులు, ప్రసాదాలు నివేదన చేయబడ తాయి. గాయత్రీ అమ్మవారిని దర్శించటం వలన ఆరోగ్యం లభిస్తుంది. గాయత్రీమాతను వేదమాతగా కొలుస్తూ, గాయత్రీ మాతను దర్శించడం వలన సకల మంత్రసిద్ధి తేజస్సు, జ్ఞానము పొందుతారు.

దసరా ఉత్సవాలు ప్రారంభం

బాలత్రిపుర సుందరీదేవి అలంకరణలో దుర్గమ్మ

విశాలాంధ్ర-విజయవాడ (వన్‌టౌన్): విజయవాడ ఇంద్రకీలాద్రిపై సోమవారం దసరా ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. సెప్టెంబర్ 22వతేదీ నుంచి అక్టోబర్ 2వతేదీ వరకు ఈ వేడుకలు కొనసాగనున్నాయి. 11 రోజుల్లో 11 రూపాల్లో దుర్గమ్మ దర్శనం ఇవ్వనున్నారు. అమ్మవారిని దర్శించుకునేందుకు భారీగా భక్తులు తరలివస్తున్నారు. భక్తులకు అసౌకర్యం కలగకుండా ఆలయ అధికారులు ఏర్పాట్లు చేశారు. తొలి రోజు బాలాత్రిపుర సుందరీదేవి రూపంలో ఉన్న అమ్మవారిని భక్తులు దర్శించుకున్నారు. తొలి రోజు అమ్మవారికి స్నపనాభిషేకం అనంతరం 8గంటలకు దర్శనాన్ని అందించారు. ఈ ఏడాది అమ్మవారి దర్శనానికి ఉభయ తెలుగు రాష్ట్రాలతో పాటు ఇతర ప్రాంతాలు, పొరుగు రాష్ట్రాల నుంచి 20లక్షల మందికిపైగా భక్తులు రానున్నారని అధికారులు అంచనా వేస్తున్నారు. ఇక వీఐపీ, వీవీఐపీ దర్శన సమయాలు ఉదయం 7 నుంచి 9గంటల వరకు, మధ్యాహ్నం 3నుంచి సాయంత్రం 5గంటల వరకు అధికారులు నిర్ణయించారు. సామాన్య భక్తులకు పెద్దపీట వేసేలా ఆలయ అధికారులు ఏర్పాట్లు చేశారు. రూ.500 టిక్కెట్లు రద్దు చేశారు. రూ.300, రూ.100 టికెట్లు మాత్రమే అందుబాటులో ఉంచారు. వృద్ధులకు, వికలాంగులు, గర్భిణీలకు ప్రత్యేక దర్శనం సాయంత్రం 4గంటలకు కల్పించేలా ఏర్పాట్లు చేశారు. అన్నదానం, ప్రసాదం పంపిణీ నిత్యం కొనసాగనుంది. ఇక క్యూలైన్‌లో భక్తులకు -మిగతా 2 లో ...

స్మృతి చిహ్నంగా

గురజాడ గృహం అభివృద్ధి చేయాలి

అరసం జాతీయ అధ్యక్షుడు పెనుగొండ లక్ష్మీనారాయణ

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : దీనావస్థలో ఉన్న మహాకవి గురజాడ అప్పారావు గృహాన్ని అభివృద్ధి పరిచి సాహితీ వేత్తలకు, సామాజిక మార్పు కోసం తపిస్తున్న ఔత్సాహిలకు స్మృతి నిలయంగా రాష్ట్ర ప్రభుత్వం అభివృద్ధి పరచాలని అభ్యుదయ రచయితల సంఘం జాతీయ అధ్యక్షులు పెనుగొండ లక్ష్మీనారాయణ కోరారు. మహకవి గురజాడ అప్పారావు స్వగృహంను అభివృద్ధి చేయాలని..గురజాడ అప్పారావు స్మారక చిహ్నాన్ని ఏర్పాటు చేయాలని కోరుతూ... జనచైతన్య వేదిక హాలులో సోమవారం మీడియా సమావేశం జరిగింది. ఈ సందర్భంగా పెనుగొండ లక్ష్మీనారాయణ మాట్లాడుతూ సాంస్కృతిక స్థాయి లోపించిన పాలక పక్షాలతో తెలుగు సాహిత్యానికి, సమాజానికి విఘాతం కలుగుతుందన్నారు. తమిళనాడు, కేరళ, కర్ణాటక లాంటి రాష్ట్రాలు ప్రాచీన రచయితలను గుర్తు చేసుకుంటూ గౌరవిస్తున్న తరుణంలో ఆంధ్రప్రదేశ్‌లో గురజాడ, కందుకూరి, గిడుగు, జాషువా వంటి మహనీయులను విస్మరించడం -మిగతా 2 లో ...

సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు

వైద్యారోగ్య కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ వీరపాండ్యన్

విశాలాంధ్ర-గుంటూరు సిటీ: జిల్లాలోని పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో సీజనల్ వ్యాధులు వ్యాప్తి చెందకుండా తాగునీరు, పారిశుధ్యం పర్యవేక్షణతో పాటు అనారోగ్యకరమైన ఆహారం అమ్మకాలు జరగకుండా ప్రణాళిక ప్రకారం పకడ్బందీగా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర వైద్యారోగ్య కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ వీరపాండ్యన్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్లోని ఎస్ఆర్ శంకరన్ సమావేశ మందిరంలో రాష్ట్ర వైద్యారోగ్య కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ వీరపాండ్యన్, జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియా, కమిషనర్ పులి శ్రీనివాసులతో కలిసి గుంటూరు నగరపాలక సంస్థలో నమోదవుతున్న డయేరియా -మిగతా 2 లో ...

ఫలితాలిస్తున్న

క్యూఆర్ కోడ్

-యుద్ధ ప్రాతిపదికన సమస్యలు పరిష్కారం

-ఎప్పటికప్పుడు అధికార యంత్రాంగం అప్రమత్తం

-ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్ జి లక్ష్మీశ

విశాలాంధ్ర-విజయవాడ: భక్తుల సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకోవడం కోసం ఏర్పాటుచేసిన క్యూఆర్ కోడ్ ద్వారా ఫీడ్ బ్యాక్ -మిగతా 2 లో ...

నాగార్జునసాగర్‌కు కొనసాగుతున్న వరద

26 క్రస్టు గేట్లు ఎత్తివేత

విశాలాంధ్ర-విజయపురిసౌత్ : నాగార్జున సాగర్ ప్రాజెక్టుకు శ్రీశైలం నుంచి వరద భారీగా కొనసాగుతోంది. సాగర్ జలాశయానికి 3,05,809 లక్షల క్యూసెక్కుల వరద వస్తుండటంతో సోమవారం సాగర్ 26 క్రస్టు గేట్లను తెరచి నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. సాగర్ ప్రాజెక్టు ప్రధాన జలవిద్యుత్ కేంద్రం ద్వారా 33,408 క్యూసెక్కుల నీరు, కుడి కాలువకు 9500 క్యూసెక్కులు, ఎడమ కాలువకు 5087 క్యూసెక్కులు, ఎస్ఎల్బీసీకి 2400 క్యూసెక్కులలో -మిగతా 2 లో ...

(మొదటి పేజీ తరువాయి)

ఉపరాష్ట్రపతి పర్యటనకు పకడ్బందీ ఏర్పాట్లు

రాధాకృష్ణన్ పర్యటించు మార్గాలలో కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేయాలని, రాష్ట్ర పోలీస్ విభాగంతో పాటు కేంద్ర భద్రతా దళాల సమన్వయంతో పనిచేయాలని, ముఖ్య ప్రాంతాల్లో ప్రత్యేక బందోబస్తు, బాంబ్ స్క్వాడ్, డాగ్ స్క్వాడ్‌లు సిద్ధంగా ఉంచాలని డిజిజి కమలేష్ సింగ్ అధికారులకు సూచించారు. అనంతరం జిల్లా కలెక్టర్ డీకే. బాలాజీ మాట్లాడుతూ ఉపరాష్ట్రపతి ఈ నెల 24 సాయంత్రం 4.20 గంటలకు గన్నవరం విమానాశ్రయం చేరుకుంటారని, 5.40కి పున్నమి ఘాట్ ను సందర్శించి 7.20 గంటలకు బయలుదేరి తిరుపతికి వెళతారని తెలిపారు. ఉపరాష్ట్రపతికి ఆహ్వానం పలుకు ప్రముఖుల జాబితాను సిద్ధంగా ఉంచుకోవాలని, వరుస క్రమంలో ఉండేలా తగిన చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో ఏఎస్ఎల్ అధికారి సిఆర్పిఎఫ్ కమాండర్ ధర్మవీర్ జకర్, సిఆర్పిఎఫ్ అసిస్టెంట్ కమాండర్ తేజ్ బహదూర్, డిపిఓ డా. జె.అరుణ, తదితర అధికారులు పాల్గొన్నారు.

96 మందితో దసరా సేవా కమిటీ

96 మందితో ఈ కమిటీని ప్రకటించారు. ఈ కమిటీలో అత్యధికంగా స్థానిక బీజేపీ ఎమ్మెల్యే సుజనా సిఫార్సు చేసిన వారు 27 మంది, ఎంపీ కేశినేని చిన్ని సిఫార్సు చేసినవారు 21 మంది ఉన్నారు. విజయవాడ తూర్పు ఎమ్మెల్యే సిఫార్సు మేరకు 11 మందికి, మంత్రి కొల్లు రవీంద్ర ప్రతిపాదించిన 10మందికి, మరో మంత్రి కొలుసు పార్థసారథి సిఫార్సు చేసిన ఆరుగురికి స్థానం కల్పించారు. అదేవిధంగా మంత్రి సత్యకుమార్ యాదవ్ సూచించిన ఐదుగురికి, ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు సిఫార్సు చేసిన ఐదుగురికి, దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి రెడ్డి సూచించిన ముగ్గురికి, జనసేన పార్టీ సిఫార్సు చేసిన ఐదుగురికి, గంటా గౌతం అనే నాయకుడు సిఫార్సు మేరకు ఇద్దరికి, జగ్గయ్యపేట ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ (తాతయ్య) సూచించిన ఒకరికి కూడా ఈ కమిటీలో చోటు కల్పించారు. కాగా, దసరా ఉత్సవాల కోసం ఇంతమందితో కమిటీ ఎప్పుడూ నియమించలేదని, రాజకీయపరమైన సమతూకం పాటిస్తూ జంబో కమిటీని నియమించారని భక్తులు చర్చించుకుంటున్నారు.

దసరా ఉత్సవాలు ప్రారంభం

నీటి బాటిల్స్, మజ్జిగ, పాలు, బిస్కెట్లు పంపిణీ చేస్తున్నారు. సుమారు 4,500 మంది పోలీసులతో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు. 500 సీసీకెమెరాలు, 25 డ్రోన్లతో ఉత్సవాల పర్యవేక్షణ జరుగుతోంది. సోమవారం సాయంత్రానికి 47 వేల మంది భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. 14,844 అన్నప్రసాదం స్వీకరించారు.

స్మృతి చిహ్నంగా గురజాడ గృహం అభివృద్ధి చేయాలి

బాధాకరమన్నారు. సాంస్కృతిక మరణం జాతి మరణానికి దోవ తీస్తుందన్నారు. మాజీమంత్రి డొక్కా మాణిక్య వరప్రసాద్ సాంస్కృతిక వారసత్వాన్ని భావితరాలకు అందించ లేని సమాజం పతనమౌతుందన్నారు. స్వదేశీ ఉద్యమానికి మంచి వారధిగా నిలిచి దేశమును ప్రేమించుమన్న లాంటి గేయాలను అందించిన గురజాడ చిరస్మరణీయుడన్నారు. మాజీ ఎమ్మెల్సీ కె.ఎస్. లక్ష్మణరావు మాట్లాడుతూ గురజాడ జయంతి ప్రతి ఏటా అధికారికంగా నిర్వహించాలని కోరారు. జనచైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షులు వల్లరెడ్డి లక్ష్మణ రెడ్డి మాట్లాడుతూ నవంబర్ 30న విజయనగరంలో గురజాడ వర్ధంతి రోజు సాహితీ ప్రియులతో, పౌర సంస్థల ప్రతినిధులతో రాష్ట్ర సదస్సును నిర్వహిస్తామని తెలిపారు. ప్రొఫెసర్ డివిఆర్ సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ నేటి ప్రజా ప్రతినిధులు తెలుగు సాహిత్యానికి విశేషేని కృషిచేసిన మహనీయుల జీవిత చరిత్రలను అధ్యయనం చేయాలన్నారు. దళిత బహుజన ఫ్రంట్ వ్యవస్థాపకులు కొరివి వినయ్ కుమార్ మాట్లాడుతూ నేటి ప్రభుత్వాలు కాంట్రాక్టర్లను, అవినీతి పరులను మార్గదర్శకులుగా చూపెడుతూ గురజాడ లాంటి మహనీయులను విస్మరించడం తగదన్నారు. ఈ కార్యక్రమంలో కన్నా మాస్టర్, సామాజిక విశ్లేషకులు టి.ధనుంజయ రెడ్డిలు పాల్గొని ప్రసంగించారు.

నాగార్జునసాగర్‌కు కొనసాగుతున్న వరద

లెవెల్ కెనాల్‌కు 300 క్యూసెక్కులు, సాగర్ నుంచి మొత్తం అవుట్ ఫ్లోగా 3,05,809 లక్షల క్యూసెక్కుల నీరు విడుదల అవుతోంది. సాగర్ ప్రాజెక్ట్ పూర్తి స్థాయి నీటిమట్టం 590 అడుగులు ఉండగా ప్రస్తుతం సాగర్ నీటి మట్టం 587.00 అడుగుల వద్ద కొనసాగుతుంది. సాగర్ ప్రాజెక్ట్ పూర్తిస్థాయి నీటి నిల్వ సామర్థ్యం 312.0450 టీఎంసీలు ఉండగా ప్రస్తుతం 305.5050 టీఎంసీల వద్ద కొనసాగుతోంది.

మానసిక స్థితి సరిగాలేని యువతి ఆత్మహత్య

విశాలాంధ్ర-విజయవాడ (క్రైం): మానసిక స్థితి సరిగాలేని యువతి ఆత్మహత్యకు పాల్పడింది. ఈ ఘటన సోమవారం విజయవాడ పటమట పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. సేకరించిన వివరాల ప్రకారం కరెన్సీనగర్‌కు చెందిన చరిష్మా(31) తల్లితో కలిసి నివాసముంటున్నారు. నాలుగేళ్ల క్రితం తండ్రి మరణించారు. అప్పటి నుంచి చరిష్మా మానసిక స్థితి సరిగాలేదు. తండ్రి గురించి ఆలోచిస్తూ ఆమె ఆరోగ్యం బాగాలేదు. తండ్రిలానే తాను చనిపోతానేమోనని భయంతో తల్లితో ప్రస్తావిస్తూ ఉండేది.ఈ క్రమంలో ఆదివారం రాత్రి తల్లి కాళ్ళకు నమస్కారం చేసి పగుగెత్తికెళ్లి రెండో అంతస్తు నుంచి దూకేసింది. రక్తగాయాలతో ఉన్న చరిష్మాను వెంటనే ఆస్పత్రికి తరలించారు. అప్పటికే యువతి మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఈ మేరకు పటమట పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఫలితాలిస్తున్న క్యూఆర్ కోడ్

విధానం ద్వారా వచ్చే భక్తుల అభిప్రాయాలను, సమస్యలను తెలుసుకుని ఎప్పటికప్పుడు పరిష్కరిస్తున్నామని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ అన్నారు. దసరా శరన్నవరాత్రి ఉత్సవాలలో తొలిరోజు సోమవారం వినాయకుని గుడి ప్రారంభం నుంచి చిన్న రాజగోపురం వరకు కాలినడకన సామాన్య భక్తుల క్యూలైన్ ద్వారా నడిచి వచ్చి భక్తుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పసి పిల్లలకు పాల లభ్యత, మంచినీరు, పారిశుద్ధ్య ఏర్పాట్లు వంటి అంశాలను పరిశీలించారు. 15 నిమిషాలలో తాను నడక దారిన చిన రాజగోపురం చేరుకున్నానన్నారు. సాధారణ భక్తుల సంతృప్తికర దర్శనం కోసం జిల్లా యంత్రాంగం చేసిన ఏర్పాట్లు బాగున్నాయని ప్రజలు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారని పేర్కొన్నారు. ఉదయం 7.30 గంటలకు ప్రారంభమైన దర్శనం మధ్యాహ్నానికి 20,000 మంది పైగా దర్శనం చేసుకున్నారని తెలిపారు. భక్తులు ఎక్కడా ఎలాంటి ఇబ్బందులు పడకుండా చాలా ఆహ్లాదకర వాతావరణంలో, ఆధ్యాత్మిక వాతావరణంలో దర్శనం చేసుకుంటున్నారన్నారు. అదే సమయంలో విఐపి దర్శనాల కోసం ప్రత్యేకంగా కేటాయించిన సమయంలో మాత్రమే ప్రముఖులు కూడా వస్తూ సామాన్య భక్తులకు పెద్దపీట వేస్తున్నారని పేర్కొన్నారు. రానున్న రోజుల్లో ఇదే రీతిన సామాన్య భక్తుల సంతృప్తికర దర్శనమే లక్ష్యంగా జిల్లా యంత్రాంగం సేవలందించాలని ఆదేశించారు. ఈ పరిశీలనలో జాయింట్ కలెక్టర్ ఇలక్కియ, నగర కమిషనర్ ధ్యానచంద్ర తదితర అధికారులు పాల్గొన్నారు.

విజయవాడ దుర్గ అమ్మవారిని దర్శించుకున్న రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, మంత్రి నాదెండ్ల మనోహర్

విశాలాంధ్ర-విజయవాడ (వన్‌టౌన్): విజయవాడ ఇంద్రకీలాద్రిపై అంగరంగ వైభవంగా సాగుతున్న దసరా మహోత్సవాలలో రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కె.పవన్ కళ్యాణ్, పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ తో కలిసి అమ్మవారిని దర్శించుకున్నారు. వారికి రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, దేవాదాయ శాఖ కమిషనర్ కె. రామచంద్ర మోహన్, ఈవో శీనా నాయక్ స్వాగతం పలికారు. శరన్నవరాత్రుల్లో మొదటి రోజైన సోమవారం బాలా త్రిపుర సుందరి దేవిగా దర్శనమిస్తున్న అమ్మవారిని పవన్ కళ్యాణ్, నాదెండ్ల మనోహర్ దర్శించుకున్నారు. వారికి వేద పండితులు ఆశీర్వచనం అందజేశారు. అనంతరం దేవాదాయ శాఖ మంత్రి, కమిషనర్, ఆలయ అధికారులు అమ్మవారి చిత్రపటం, తీర్థప్రసాదాలను అందజేశారు. పవన్ కళ్యాణ్ రాకతో ఆలయం సందడి చోటుచేసుకుంది.

సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు

కేసులు కట్టడికి చేపట్టాల్సిన చర్యలపై వైద్యారోగ్య శాఖ, పబ్లిక్ హెల్త్ ఇంజనీరింగ్, ఆర్డబ్ల్యుఎస్, ఫుడ్ సేఫ్టీ, జిజిహెచ్ మెడికల్ కళాశాల, జిల్లా అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ డయేరియా కేసులు నమోదు, తీసుకుంటున్న చర్యలను రాష్ట్ర వైద్యారోగ్య కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ వీరపాండ్యన్‌కు వివరాలు తెలియజేశారు. రాష్ట్ర వైద్యారోగ్య కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ మాట్లాడుతూ డయేరియా, కలరా వంటి సీజనల్ వ్యాధులు వ్యాప్తి చెందటానికి గల కారణాలు తెలుసుకోవడానికి, ముందస్తు జాగ్రత్త చర్యల్లో భాగంగా కమ్యూనిటీ డిసీజ్ నిపుణులతో పాటు పట్టణ ప్రాంతాల్లో మున్సిపల్ అధికారులు గ్రామీణ ప్రాంతాల్లో జిల్లా పరిషత్ లేదా పంచాయతీ అధికారులు మెడికల్ కళాశాల, ప్రభుత్వ సమగ్ర వైద్యశాల అధికారులను సమన్వయం చేసుకుంటూ ప్రత్యేకంగా ఒక బృందాన్ని ఏర్పాటు చేయాలన్నారు. ఈ బృందం కేసులు నమోదవుతున్న సమయము, ప్రాంతము, వ్యాధి బారిన పడుతున్న వ్యక్తుల వయస్సు, క్లినికల్ అంశాలు క్షేత్రస్థాయిలోని పరిస్థితులపై పూర్తిస్థాయిలో విశ్లేషణ చేయాలన్నారు. దీనివల్ల నివారణ చర్యలు మరింత పటిష్టంగా చేపట్టడానికి అవకాశం ఉంటుందన్నారు. ప్రజలకు వ్యక్తిగత పరిశుభ్రత పై అవగాహన కలిగేలా కార్యక్రమాలను నిర్వహించాలన్నారు. మున్సిపల్ అధికారులు వ్యాధులు నియంత్రణకు సంబంధిత అనుబంధ శాఖలను నిరంతరం సమన్వయం చేసుకుంటూ పటిష్టమైన చర్యలు తీసుకోవాలన్నారు. సమీక్ష సమావేశంలో ఆహార భద్రత కమిషనర్ వ్యక్తిగత శుభ్రతపై ప్రజాహితం జారీచేసిన ప్రచార పోస్టర్‌ను ఆవిష్కరించారు. సమావేశంలో ఈఎన్సి ప్రభాకర్ రావు, అదనపు కమిషనర్ ఓబులేసు, జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి డా.విజయలక్ష్మి, జిజిహెచ్ సూపరింటెండెంట్ డా.రమణా యశస్వి, ఫుడ్ సేఫ్టీ అధికారి పూర్ణచంద్రరావు తదితర అధికారులు పాల్గొన్నారు.

వాగులో కొట్టుకు పోయిన వ్యక్తి మృత దేహం లభ్యం



విశాలాంధ్ర-కంచికచర్ల: కంచికచర్ల బైపాస్ సమీపంలోని శుద్ద వాగులో గల్లంతయిన వ్యక్తి మృతదేహం లభ్యమయింది.ఆదివారం బైక్ తో సహ వాగు ప్రవాహంలో కొట్టుకు పోయిన బత్తినపాడు గ్రామానికి చెందిన కామా శ్రీనివాసరావు మృతదేహాన్ని ఎన్ డి ఆర్ ఎఫ్ బృందాలు సోమవారం వెలికి తీశారు. కంచికచర్ల మండలం బత్తిన పాడు గ్రామానికి చెందిన శ్రీనివాస రావు తన బైక్ పై చెవిటికల్లువైపు ఆదివారం మధ్యాహ్నం వెళుతుండగా శుద్దవాగు దాటే ప్రయత్నంలో బైక్ అదుపుతప్పి వాగులోపడి నీటి ప్రవాహంలో కొట్టుకుపోయాడు. ఆదివారం స్థానికుల సాయంతో వాగులో గాలింపు చర్యలు చేపట్టడంతో బైకును గుర్తించారు కానీ యువకుడి జాడ కనిపించలేదు. రెవెన్యూ అధికారులు ఎన్డీఆర్ఎఫ్ బృందాలను రప్పించడంతో ఆదివారం రాత్రి, సోమవారం ఉదయం ముమ్మరంగా గాలింపు చర్యలు చేపట్టారు. ఎట్టకేలకు కొట్టుకు పోయిన శ్రీనివాసరావు మృతదేహాన్ని గుర్తించి మధ్యాహ్నం ఒంటిగంట ప్రాంతంలో ఒడ్డుకు తెచ్చారు. శ్రీనివాసరావు మృతదేహాన్ని సంఘటనా స్థలంలో చూసిన బంధువులు గ్రామస్తులు శోకసంద్రంలో మునిగిపోయారు. ఎక్కడో ఏదో ఒక విధంగా ప్రాణాలతో కనిపిస్తాడు అని ఎంతో ఆశతో ఎదురు చూసిన తల్లిదండ్రులకు, భార్యకు చివరకు నిరాశే మిగిలింది. ఈ సంఘటనతో బత్తిన పాడు గ్రామంలో తీవ్ర విషాదం నెలకొంది. శవాన్ని పోస్టుమార్టం నిమిత్తం నందిగామ తరలించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు కంచికచర్ల ఎస్సై పి. విశ్వనాథ్ తెలిపారు.

వీఆర్ఏల సమస్యలు పరిష్కరించాలి

విశాలాంధ్ర బ్యూరో మచిలీపట్నం : గ్రామ రెవెన్యూ సహాయకులు వారి డిమాండ్లు పరిష్కరించాలని సోమవారం దర్నా చేపట్టారు. కృష్ణాజిల్లా మచిలీపట్నంలోని ధర్నా చౌక్‌లో వీఆర్ఏలు చేస్తున్న ధర్నాకు ఏఐటీయూసీ నాయకులు మద్దతు తెలిపి వారి సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కన్వీనర్ తాడిపర్తి తాతయ్య మాట్లాడుతూ వీఆర్ఏలకు పే స్కేల్ అమలు చేయాలని, నామినీలుగా పనిచేస్తున్న వీఆర్ఏలను రెగ్యులర్ చేయాలన్నారు. జిల్లా నాయకులు లింగం ఫిలిప్ మాట్లాడుతూ వీఆర్ఏలుగా పనిచేస్తూ 65 సంవత్సరాలు దాటి చనిపోయిన వీఆర్ఏ కుటుంబంలో ఒకరికి ఉద్యోగం కల్పించాలని, వీఆర్ఏ నుండి వీఆర్ఓలుగా సీనియారిటీ ప్రకారం ప్రమోషన్ ఇవ్వాలన్నారు. అడ్డాడ ప్రసాద్ బాబు మాట్లాడుతూ ఏఐటీయూసీ మీ డిమాండ్లకు పూర్తి మద్దతు తెలుపుతుందని అన్నారు. మద్దతు తెలిపిన వారిలో ఏఐటీయూసీ జిల్లా కన్వీనర్ తాడిపర్తి తాతయ్య, జిల్లా నాయకులు లింగం ఫిలిప్, నియోజకవర్గ కార్యదర్శి ఓ.ఎల్.రావు, జిల్లా నాయకులు అడ్డాడ ప్రసాద్ బాబు, తదితరులు ఉన్నారు.

భవన నిర్మాణ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

విశాలాంధ్ర-విజయవాడ: నిర్మాణ రంగంలో భవన నిర్మాణ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ నాయకులు రెడపంగు ప్రభుదాసు డిమాండ్ చేశారు. ఏఐటీయూసీ 47వ డివిజన్ బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ మహాసభ నగరంలోని డివిజన్‌లోని కనకయ్య అప్పారావు గ్రంథాలయంలో ప్రభుదాసు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల సమయంలో కూటమి నేతలు కార్మికులకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో పూర్తిగా విఫలం చెందారని, ప్రభుత్వం ఏర్పడి 16నెలలు గడుస్తున్న కార్మికుల సమస్యల పరిష్కరించలేదన్నారు. ఈ సభలో సీపీఐ నగర సీనియర్ నాయకులు యాకోబు, కార్యవర్గ సభ్యులు రమణబాబు, మైకేల్, డివిజన్ కార్యదర్శి డి విజన్ తదితర నాయకులు పాల్గొన్నారు.

నూతన కమిటీ ఎన్నిక

ఈ మహాసభలో భాగంగా 47వ డివిజన్ బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు ఎస్‌కె అమీర్, ఉపాధ్యక్షుడు వి రామరావు, కార్యదర్శి కొండి పోలు, సహాయ కార్యదర్శులు ఎస్‌కె సబ్బార్, కోశాధికారి ఇరుగు పాపారావు, ఇన్‌చార్జి కార్యదర్శి ఆర్ ప్రభుదాసులను నూతన కమిటీ సభ్యులుగా ఎన్నుకున్నారు.

ఘనంగా ప్రారంభమైన దసరా మహోత్సవాలు

విశాలాంధ్ర-విజయవాడ: అన్నపూర్ణేశ్వరి ట్రస్ట్ ఆధ్వర్యంలో ఈ నెల 22 నుండి అక్టోబర్ 2వ తేదీ వరకు జరిగే దసరా మహెూత్సవాలు న్యూ ఆర్టీసీ కాలనీలో సోమవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. తొలిరోజు అమ్మవారు బాల త్రిపుర సుందరీ అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ మహెూత్సవాలలో భాగంగా ట్రస్ట్ నిర్వహకులు అన్నపూర్ణమ్మ ఆధ్వర్యంలో ఉదయం 7.30గంటలకు అమ్మవారిక అభిషేకం, పూజ, చండీ పారాయ ణం సాయంత్రం 6.30గంటలకు శ్రీ దుర్గా దేవస్థానం మాజీ ఈవో రామారావు దంపతులు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం సామూహిక కుంకుమార్చన విశేష హారతులు, తీర్థప్రసాదాలు స్వీకరించారు. 26న సాయంత్రం 4గంటలకు శ్రీ కనకదుర్గమ్మ దేవస్థాన వేద విద్యాంసులచే వేదపారాయణ మహాసభ జరుగును. 30 నుండి 2వ తేదీ వరకు ప్రతిరోజు ఉదయం 9 గంటలకు శ్రీ రుద్రసహిత చండీ హోమం,. విజయదశమి రోజున 12గంటలకు మహిమంగళ పూర్ణాహుతి అనంతరం అన్నప్రసాద వితరణ కార్యక్రమాలకు భక్తులందరూ విశేషంగా పాల్గొని దుర్గాదేవి కృపకు పాత్రులు కాగలరని నిర్వహకులు కోరారు.

దీపం మినిస్ట్రీస్ సేవా కార్యక్రమాలు

విశాలాంధ్ర-పెదన : ది వరల్డ్ ఆఫ్ లైఫ్ చర్చ్ దీపం మినిస్ట్రీస్ ఆధ్వర్యంలో పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు పాస్టర్. జాన్ డానియల్ తెలిపారు. ఈ మేరకు పట్టణంలో 15వ వార్డులో ఉన్న చర్చి ఆవరణలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రతినెల దీపం మినిస్ట్రీస్ వారి ఆధ్వర్యంలో నాలుగు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో పాస్టర్ జాన్ డానియల్, పి దేవదానం, పాస్టర్ జెకర్యా, పాస్టర్ మనోహరం, పాస్టర్ యోహాను, పెరికే. కృపావరం తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో దేవి శరన్నవరాత్రి ఉత్సవాలు

విశాలాంధ్ర-గంపలగూడెం: గంపలగూడెం మండలం, నెమలి గ్రామములో వేంచేసియున్న శ్రీ వేణుగోపాల స్వామి వారి దేవస్థానము నందు దేవి శరన్నవరాత్రులు సందర్భముగా అఖండ దీపారాధన వెలిగించి రాజ్యలక్ష్మి అమ్మవారు ఆదిలక్ష్మి అలంకరణలో దర్శనము ఇచ్చారు. అమ్మ వారికి కుంకుమ పూజ చేశారు. వికాస తరంగిని సభ్యులు లలిత విష్ణు సహస్ర నామ పారాయణము చేశారు. ఈ కార్యక్రమాల్లో ఆలయ అసిస్టెంట్ కమిషనర్, కార్ని నిర్వహణ అధికారిని నేల. సంధ్య,మాజీ దేవస్థానం చైర్మన్ బెల్లం. మధుసూదనరావు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. మేడూరు శ్రీ కాత్యాయని సమేత జీవన్ముక్తేశ్వర స్వామి వారి దేవస్థానంలో దేవి నవరాత్రుల్లో భాగంగా బాలా త్రిపుర సుందరి దేవిగా అమ్మవారి నీ అలంకరించిపూజలు నిర్వహించారు.

దరఖాస్తులు అందజేత

విశాలాంధ్ర, మచిలీపట్నం : సీపీఐ మచిలీపట్నం నియోజకవర్గ కార్యదర్శి ఓడుగు చైతన్యకుమార్ ఆధ్వర్యంలో భారత ప్రభుత్వం ఏర్పాటు చేసిన నూతన పథకం కింద భర్త చనిపోయిన వారికి బందర్ స్థానిక తహశీల్దార్ కార్యాలయం లో సోమవారం దరఖాస్తులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రం 18 ఏళ్లు నుండి 60 ఏళు నిండి ఉన్న కుటుంబ యజమాని మరణిస్తే 20వేల రూపాయలు యజమాని పై ఆధారపడి ఉన్న కుటుంబ సభ్యుల బ్యాంక్ అకౌంట్లో రూ.20వేలు జమ చేస్తారని, పథకాన్ని ప్రతి ఒక్కరు వినియోగించుకోవాలని ఆయన కోరారు.

హోమియోలో సోహన్‌సింగ్ కొత్త వరవడికి శ్రీకారం

సీఆర్ వికాస కేంద్రం ట్రస్ట్ సభ్యులు అడ్డాడ ప్రసాద్ బాబు

విశాలాంధ్ర-చల్లపల్లి : హెూమియో రంగంలో కొత్త ఒరవడికి శ్రీకారం చుట్టిన మహానుభావుడు డాక్టర్ సోహన్ సింగ్ అని శ్రీ చంద్ర రాజేశ్వరరావు వికాస్ కేంద్రం ట్రస్ట్ డైరెక్టర్ అడ్డాడ ప్రసాద్ బాబు పేర్కొన్నారు. ప్రముఖ హెూమియో రంగ నిపుణులు డాక్టర్ సోహన్ సింగ్ ద్వితీయ వర్ధంతి సి ఆర్ వికాస కేంద్రంలో హెూమియో క్యాంపు నందు సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ట్రస్ట్ సభ్యులు అడ్డాడ ప్రసాద్ బాబు మాట్లాడుతూ అనేకమంది పేద ప్రజలకు ఉచితంగా వైద్య సేవ అందించారని కొనియాడారు. సోహన్ సింగ్ నేషనల్ హెూమియోపతి కౌన్సిల్ మెంబర్గా పని చేశారని గుర్తు చేశారు. అనేక ఉచిత హెూమియో క్యాంపులకు ఆయన వెన్నుదన్నుగా నిలిచారన్నారు. అలాంటి మహానుభావుని స్మరించుకోవడం తన అదృష్టంగా భావిస్తున్నానని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ శ్రావణి, సిద్దాబత్తుల వాసు, హర్ష, కొండలు తదితరులు పాల్గొన్నారు.

నిరంతరం పర్యవేక్షించాలి : కమిషనర్

విశాలాంధ్ర-విజయవాడ కార్పొరేషన్ : దసనా నవరాత్రులలో అధికారుల నిరంతర పర్యవేక్షణ కచ్చితంగా ఉండాలని నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర ఆదేశించారు. కమిషనర్ నగర పర్యటనలో భాగంగా స్థానిక వినాయకుని గుడి, కెనాల్ రోడ్, కృష్ణవేణి ఘాట్, భవాని ఘాట్, పున్నమి ఘాట్, అమరావతి స్టాక్ పాయింట్, క్యూలైన్లు, వాటర్ పాయింట్లు, మరుగుదొడ్ల పాయింట్లు, కేశఖండనశాల, ప్రాంతాల్లో పర్యటించి పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సిబ్బంది సమయపాలన కచ్చితంగా పాటించాలని, సిబ్బంది కచ్చితంగా హాజరు కావాలని, ప్రతి వాటర్ పాయింట్ వద్ద త్రాగునీటిని అధికారులు పర్యవేక్షిస్తూ కమాండ్ కంట్రోల్ రూమ్ నుండి గంట గంటకు రిపోర్ట్ తీసుకుంటూ త్రాగునీటి కొరత లేకుండా చూసుకోవాలని అన్నారు. ఈ పర్యటనలో చీఫ్ ఇంజనీర్ ఆర్.శ్రీనాథ్‌రెడ్డి, చీఫ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ కె.అర్జునరావు, చీఫ్ సిటీ ప్లానర్ కె.సంజయ్ రత్నకుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

టెర్రస్ గార్డెనింగ్‌పై వీఎంసీ విస్తృత అవగాహన

నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర ఆదేశాల మేరకు స్వచ్ఛోత్సవ్-స్వచత హి సేవ 2025లో భాగంగా ఇంటిపైన కూరగాయలు పండించే విధంగా విస్తృతంగా అవగాహన కార్యక్రమాన్ని చేపట్టింది. అందులో భాగంగా సోమవారం నగరపాలక సంస్థ అధికారులు స్థానిక భారతి నగర్, గురునానక్ కాలనీ, చెట్టు నగర్‌లో మిద్దపైన వివిధ రకరకాల కూరగాయలను పండిస్తున్న వారితో అవగాహన కల్పించారు. వన్ ఎర్త్, వన్ లైఫ్ సౌజన్యంతో నగరపాలక సంస్థ ఈ అవగాహన కార్యక్రమాన్ని చేపట్టింది. ప్రతి ఒక్కరూ టెర్రస్ గార్డెనింగ్‌ను ఏర్పాటు చేసుకోవాలని సూచిస్తున్నారు.

నాయీబ్రాహ్మణులకు చులకన చేస్తే సహించం

టీడీపీకి అర గుండు కొడతాం - పైడాడ శ్రీనివాసరావు హెచ్చరిక

విశాలాంధ్ర-విజయవాడ (వన్‌టౌన్): నాయీబ్రాహ్మణులకు చులకన చేస్తే సహించమని రాష్ట్ర నాయీబ్రాహ్మణుల నాయకులు పైడాడ శ్రీనివాసరావు హెచ్చరించారు. తమను కించపరిచేలా మాట్లాడితే టీడీపీకి అర గుండు కొడతామన్నారు. పనిలేని మం..లోడు అదేదో బొచ్చు పీకినట్లు అంటూ బాపట్ల టీడీపీ ఎమ్మెల్యే వేగేశన నరేంద్ర వర్మ చేసిన వాఖ్యలపై ఆయన తీవ్ర అగ్రహం వ్యక్తం చేశారు. అధికారం గర్వం తలకెక్కి మాట్లాడారని తక్షణం ఆయనపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. నాయీబ్రాహ్మణులను తిట్టకూడదన్న విషయం తెలియని వర్మ ఎమ్మెల్యే ఎలా అయ్యావంటూ మండిపడ్డారు. మీ కులాన్ని సామెతలతో తిట్టిపోస్తే ఊరుకుంటారా? అని ప్రశ్నించారు. మనిషి పుట్టుక నుంచి చావుదాకా నాయీబ్రాహ్మణులు ఉండాలన్న విషయం తెలుసుకోవాలన్నారు. నాయీ బ్రాహ్మణులను, వారి సామాజికవర్గానికి కించపరిచే పదాలపై మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి గత ప్రభుత్వంలో నిషేధం విధించిందన్నారు. అందుకు బాధ్యులైన వారి పై 1860 కింద చట్టపరమైన చర్యలు తీసుకోవాలని జీవో 50 జారీ చేశారన్నారని గుర్తు చేశారు. ఈమేరకు బాటప్ల ఎమ్మెల్యే నరేంద్ర వర్మపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆయన డిమాండ్ చేశారు.

రైల్వేస్టేషన్లో పారిశుధ్యం దారుణం

విశాలాంధ్ర,విజయవాడ (గాంధీనగర్) : విజయవాడ రైల్వే స్టేషన్లో శానిటేషన్ పరిస్థితి అత్యంత దారుణంగా ఉంది. ఒకపక్క డివిజన్ వ్యాప్తంగా 'స్వచ్ఛతా హీ సేవా" ప్రచారం భాగంగా స్వచ్ఛత వారోత్సవాలు జరుగుతుంటే డివిజన్ కేంద్రమైన విజయవాడ రైల్వే స్టేషన్లో చెత్త ఎక్కడపడితే అక్కడ దర్శనమిస్తున్నాయి.రోజుకి లక్ష మంది పైగా ప్రయాణించే రైల్వే స్టేషన్లో పరిశుభ్రత లేకపోవడంతో ప్రయాణికులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఒకపక్క దసరా శరన్నవరాత్రుల ఉత్సవాలు జరుగుతుంటే పరిశుభ్రతపై మరింత అప్రమత్తంగా ఉండవలసిన అత్యంత నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. రైల్వే ఉన్నతాధికారులు దీనిపై దృష్టి సారించి ఆ ప్రైవేట్ కాంట్రాక్టర్ పై చర్యలు తీసుకుంటారో లేక పరిశుభ్రత విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తారు చూడాల్సి ఉంది.

ఆధ్యాత్మిక సంగీతంతో మానసిక ఉల్లాసం : ఏ సత్యానంద

విశాలాంధ్ర-విజయవాడ: న్యాయవాదుల జీవనశైలిలో అధ్యాత్మిక చింతనతో కూడిన సంగీతాన్ని అస్వాదించడంతో మానసిక ఉల్లాసాన్ని పొందుకుంటారని జిల్లా రెండవ అదనపు న్యాయమూర్తి ఏ సత్యానంద సూచించారు. దసరా నవరాత్రుల సందర్భంగా ది బెజవాడ బార్ అసోసియేషన్ హాల్‌లో సోమవారం అమ్మవారి సంకీర్తలాపన జరిగినది. ముంబై నుంచి ప్రముఖ గాయని వరలక్ష్మీ నారాయణతో పాటు గ్రూప్ సభ్యులు దుర్గా సుకర, సిహెచ్ రాజ్యలక్ష్మి ,జి సుజాత, ధారా ప్రసూనలు ఆలపించిన సంకీర్తనలతో అద్యాత్మిక వాతావరణం సంతరించుకుంది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా హాజరైన న్యాయమూర్తి సత్యానంద, కమర్షియల్ కోర్టు న్యాయమూర్తి ఓబులరెడ్డి మాట్లాడుతూ నిత్యం వివిధ కేసుల ఒత్తిడితో న్యాయవాదులు మానసికంగా ఇబ్బందిపడుతున్నారని ఈ క్రమంలో ఇలాంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలు మానసిక వికాసానికి దోహదపడతాయని తెలిపారు. అనంతరం బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఏకే భాషా మాట్లాడుతూ ఆధ్యాత్మిక చింతనతో మనసుకు ప్రశాంతత చేకూరతుందని ప్రతి ఒక్కరూ భక్తి భావంతో మెలగాలని ఈ విధంగా భక్తి పాటలతో అలరింపజేసిన వరలక్ష్మి నారాయణ బృందానికి కృతజ్ఞతలు తెలిపారు.

సెల్‌ఫోన్ షాపులో సేల్స్ బాయ్ దాడి

విశాలాంధ్ర-విజయవాడ (క్రైం): సెల్‌ఫోన్ షాపులో సేల్స్ బాయ్ పై దాడి ఘటన సోమవారం విజయవాడ గవర్నర్‌పేట పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. నగరానికి చెందిన బాబురామ్ ఎన్టీఆర్ కాంప్లెక్స్‌లోని సెల్‌ఫోన్ షాపులో సేల్స్ బాయ్‌గా పని చేస్తున్నాడు. ముగ్గురు యువకులు సేల్‌ఫోన్ పౌచ్ కోసం వచ్చారు. డబ్బులు విషయంలో గోడవ జరిగింది. అయితే ముగ్గురు యువకులు కలిసి సేల్స్ బాయ్ పై బ్లేడ్‌తో దాడి చేశారు. ఈ దాడిలో సేల్స్ బాయ్‌కు గాయాలు అయ్యాయి. అయితే ఈ ముగ్గురు యువకుల్లో ఇద్దరి పై విజయవాడ టూటౌన్ పోలీస్ స్టేషన్‌లో కేసులు ఉన్నాయి.

చిట్టూర్పులో సాంస్కృతిక పోటీలు

విశాలాంధ్ర- ఘంటసాల : తాళం భజన మురళీ కోలాటం సంస్కృతికి నిదర్శనం అని నియోజకవర్గ యువనాయకులు మండలి వెంకట్రామ్ అన్నారు. ఘంటసాల మండలం చిట్టూర్పులోని శ్రీ గంగా భ్రమరాంబ సమేత మల్లేశ్వర స్వామి వారి దేవస్థానం ప్రాంగణంలో "6వ కృష్ణా, ఎన్టీఆర్, ఏలూరు జిల్లాల స్థాయి తాళం భజన మురళీ కోలాటం పోటీలు" పీఏసీఎస్ అధ్యక్షులు గుత్తికొండ వరప్రసాద్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. నియోజకవర్గ యువనాయకులు మండలి వెంకట్రామ్, టీడీపీ అబ్జర్వర్ కనపర్తి శ్రీనివాసరావు అతిథులుగా విచ్చేసి పోటీలు ప్రారంభించారు. వెంకట్రామ్ మాట్లాడుతూ తెలుగు సంస్కృతి, సాంప్రదాయాలు చాటి చెప్పే విధంగా పోటీలు నిర్వహిస్తున్న గుత్తికొండ వరప్రసాద్ అభినందనీయులని తెలిపారు. టీడీపీ నేత బొబ్బా గోవర్ధన్, టీడీపీ మండల అధ్యక్షులు తుమ్మల చౌదరి బాబు, ఘంటసాల ఏఎంసీ చైర్మన్ తోట కనకదుర్గ, స్టేట్ ఇరిగేషన్ కార్పొరేషన్ డైరెక్టర్, సర్పంచ్ పైడిపాముల కృష్ణకుమారి, స్వచ్ఛ ఆంధ్రప్రదేశ్ మిషన్ డైరెక్టర్, మాజీ వైస్ ఎంపీపీ బోలెం నాగమణి, ఏపీ నాటక అకాడమీ డైరెక్టర్, ఎంపీటీసీ పైడిపాముల స్వప్న, రంగస్థల కళాకారుడు బోలెం రామారావు, దిరిశం బాలకోటయ్య, మేడికొండ విజయ్, నిర్వాహకులు, భక్త సమాజం సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

CHANGE OF SURNAME

I **DASARI DURGA (Old Name), W/o. LAKSHMAN**, resident of D.No: 6-C-59, SC COLONY, ALLURU, NTR DISTRICT-521181, A.P. I have changed my Surname as **SANGEETH DURGA (New Name), Wo. LAKSHMAN**, Here after my name is known as **SANGEETHA DURGA (New Name), W/o. LAKSHMAN.**

దేవీ శరన్నవరాత్రులు ప్రారంభం

విశాలాంధ్ర, విస్సన్నపేట : విస్సన్నపేట మండలంలో సోమవారం నుంచి దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. స్థానిక కనకదుర్గ దేవాలయం, చంద్రశేఖరస్వామి దేవాలయం, పుట్లేట మారెమ్మ దేవాలయంతోపాటు పలు ప్రాంతాల్లో అమ్మవారి ప్రతిమలను ఏర్పాటు చేసి, భక్తులు ఈ ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. స్థానిక పద్మశాలీయుల వీధి, సానం వారి వీధి, భవానీ వీధులకు చెందిన భక్తులు స్థానిక శివాలయం నుంచి అమ్మవారిని ఊరేగింపుగా తమ ప్రాంతాలకు తీసుకెళ్లి ప్రతిష్టించి, ఉత్సవాలు ప్రారంభించారు.

స్వస్త్ నారీ -సశక్త్ పరివార్ అభియాన్ పరీక్షలు

విశాలాంధ్ర-కూచిపూడి : స్వస్త్ నారీ - సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమాన్ని మొవ్వ ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రం పరిధిలోని పెదసనగల్లు గ్రామ సచివాలయంలో సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా 106 మందిని పరీక్షించి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. నిడుమోలు పీ.హెచ్.సి వైద్య అధికారి డాక్టర్ విజయ్ కుమార్ రోగులను పరీక్షించారు. మొవ్వ పిహెచ్సి పరిధిలోని ఏఎన్ఎం లతోపాటు సచివాలయ సి.హెచ్.ఓ.లు స్వీటీ, దీపిక, యశ్విత, నీలిమ, దివ్య, కమలాలతోపాటుఆశా వర్కర్స్ సహకరించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి విజయ్ కుమార్ మాట్లాడుతూకేంద్ర,రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న ఈ వైద్య సేవలను మహిళలు సద్వినియోగం చేసుకోవాలని అవగాహన కల్పించారు.

పారిశుద్ధ్యంపై మలేరియా అధికారి ఆగ్రహం

విశాలాంధ్ర-కృత్తివెన్ను : లక్ష్మీపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో పల్లెపాలెం గ్రామంలో పారిశుద్ధ్య నిర్వహణ లోపం కారణంగా డెంగ్యూ, మలేరియా లాంటి వ్యాధులు వ్యాపిస్తున్నాయని జిల్లా మలేరియా అధికారి గుర్తించారు. గ్రామంలో ఇటీవల డెంగ్యూ, మలేరియా జ్వర పీడితులను అధికంగా గుర్తించారు. దీంతో వైద్య సిబ్బంది గత వారం రోజులుగా గ్రామంలో వైద్య శిబిరాన్ని నిర్వహిస్తూ పర్యవేక్షిస్తున్నారు. సోమవారం జిల్లా మలేరియా అధికారి బి రామారావు గ్రామంలో పర్యటించారు. గ్రామాలకు ఉన్న అపరిశుభ్ర వాతావరణాన్ని గమనించి గ్రామస్తులతో చర్చించారు. అయితే గ్రామంలో పారిశుద్ధ నిర్వహణ విషయంలో పంచాయతీ సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న విషయం గుర్తించారు. దీంతో వారితో చర్చించి తక్షణం పారిశుద్ధ నిర్వహణ చర్యలు చేపట్టాలని వైద్యాధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో లక్ష్మీపురం యూనిట్ అధికారి పి మురళి, వైద్యాధికారిని షేక్ హీన, హెచ్ ఈ ఓ ప్రభావతి, ఎంపీహెచ్ఎస్ రాజేంద్రప్రసాద్, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు పాటు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఖరీఫ్‌లో యాజమాన్య పద్ధతులపై చర్చా గోష్ఠి

విశాలాంధ్ర-పమిడిముక్కల: ఖరీఫ్ సాగు లో రైతులు అధిక మోతాదులో రసాయనాలు వినియోగిస్తున్నారని దీనితో సాగు ఖర్చులు అధికమై నికరాదాయం తగ్గుతుందని కేవికె సమన్వయ కర్త డాక్టర్ సుధారాణి అన్నారు.వీరంకిలాకు రైతు సేవా కేంద్రంలో కృషి విజ్ఞాన కేంద్రం ఘంటసాల, ఇఫ్కో కంపెనీ సహకారంతో ఖరీఫ్ సీజన్లో మేలైన యాజమాన్య పద్ధతులు పై చర్చా గోష్ఠి నిర్వహించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రస్తుతం వరి సాగు లో తీసుకోవలసిన మేలైన యాజమాన్య పద్ధతులు మరియు చేపట్టవల్సిన మేలుకువలు గుర్చి రైతులకు వివరంగా తెలియజేశారు.ఇఫ్కో తరుపున నానో యూరియా,నానో డిఎపి వాటి పనితీరు ఉపయోగించే విధానము డ్రోన్ తో పిచికారి మొదలైన అంశాలపై చర్చ నిర్వహించారు.అనంతరం వరి పొలాలను క్షేత్ర సందర్శనం చేసి ఆకుముడత పురుగు యాజమాన్య కొరకు ఎసిఫేట్ 300గ్రా, లేదా క్లోరంట్రనిలిప్రోల్ 60 మి.లీ.ఎకరానికి పిచికారి చేయాలని,పొడతెగులు ఆశిస్తే హెక్సాకోనజోల్ 400మి.లి.ఎకరానికి పిచికారి చేయాలని సూచించారు.ఈ కార్యక్రమంలో కేవికె శాస్త్రవేత్తలు వెంకటలక్ష్మి,రేవతి ,ఇఫ్కో మేనేజర్ నంద కిషోర్ ఎఓ గణేష్ రెడ్డి పలువురు రైతులు పాల్గొన్నారు.

దళితుల శ్మశానవాటికకు స్థలం ఇవ్వాలి

విశాలాంధ్ర - గుడివాడ : 20 ఏళ్లుగా దళితులకు సమాధులు ఏర్పాటు చేయాలని ఎన్ని పోరాటలు చేసినప్పటికి స్థలాలు కేటాయి చక పోవడం దారుణమని వారికి వెంటనే భూమి కేటాయించాలని కోరుతూ దళిత నాయకులు నిరసన తెలిపారు. సోమవారం స్థానిక ఆర్డీవో కార్యాలయం ఎదురుగా దళిత సమాధుల సాధన కమిటి ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా సాధన కమిటి, దళిత నాయకులు కంచర్ల సుధాకర్ మాట్లాడుతూ దళితులకు సమాధులు లేక అనేక ఇబ్బందులకు గురి కావలిసివస్తుందన్నారు. అనేక పోరాటల వల్ల గతంలో ఎఫ్‌సిఐ సమీపంలో విశ్వశెట్టి పూర్ణచంద్రరావు చెందిన స్థలాని కేటాయించమని అప్పటి జిల్లా జాయింట్ కలెక్టర్ చంద్రుడు చెప్పడం జరిగిందన్నారు. అనతరం ఆర్డీఓ కార్యాలయం ఏఓకు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ నిరసన కార్యక్రమంలో పాస్టర్ జడ జనన్న, కోదమల గంగాధరావు, వేశపోగుల యేసయ్య, వేమూరి సుజాత, తుళ్లూరి ప్రశాంత్, మామిళ్ళ ఏలిషా, మణిక్యలరావు, సుందరయ్య, రాజేష్, పాస్టర్లు సంఘం, దళిత సంఘల నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛమైన నీటితో సంపూర్ణారోగ్యం

విశాలాంధ్ర-విస్సన్నపేట : స్వచ్ఛమైన నీటిని శరీరానికి అందించటంతో ప్రతి వ్యక్తి సంపూర్ణారోగ్యం పొందవచ్చని టీడీపీ మండలపార్టీ అధ్యక్షుడు రాయల సుబ్బారావు అన్నారు. విస్సన్నపేట లో ఏర్పాటు చేసిన క్వీన్స్ ఆల్కలిన్ వాటర్ ప్లాంట్ కార్యాలయాన్ని సోమవారం ప్రారంభించారు. సంస్థ నిర్వాహకుడు కె.అనంతరాణి మాట్లాడుతూ, శరీరంలోని వ్యాధులను తగ్గించేందుకు అనువైన అధిక పీహెచ్ విలువ కలిగిన నీటిని తమ సంస్థ రూపొందిస్తున్నట్లు వివరించారు. కార్యక్రమానికి టీడీపీ నేతలు అనుమోలు శివబాజి, మేడా రాజశేఖర్, కోలేటి రంగారావు, సుబ్బారావు, కె.నాగరాజు, పలువురు గ్రామ ప్రముఖులు హాజరయ్యారు.

దసరా ఉత్సవాలు ప్రారంభం

విశాలాంధ్ర-కూచిపూడి : మొవ్వ మండలంలో దసరా శరన్నవరాత్రి వేడుకలు సోమవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. మండలంలో శైవ, వైష్ణవ దేవాలయాలు, గ్రామాల్లో పందిళ్ళు వేసి ఏర్పాటుచేసిన విగ్రహాల వద్ద పూజలు చేశారు. కూచిపూడి బాలా త్రిపురసుందరి అమ్మవారి సన్నిధిలో బాల కుమారి పూజలు, సువాసినిపూజలు, లలితాపరమేశ్వరి సువాసిని పూజలు పూర్ణ దీక్షాపరులు జోశ్యులకార్తికేయ శర్మ ఆధ్వర్యంలోశాస్త్రయుక్తంగా వేదమంత్రోచ్ఛరణలమధ్య మంగళ వాయిద్యాలు నిర్వహించారు. మండలంలోని 21 గ్రామాలలో అత్యంత వైభవంగా ప్రారంభమైనాయి.

అవురుపూడిలో క్రీడా సాంస్కృతిక కార్యక్రమాలు

అవురుపూడిలో కృష్ణా చిల్డ్రన్స్ క్లబ్ ఆధ్వర్యంలో సోమ వారం దసరా సందర్భంగా పిల్లలకు సాంస్కృతిక క్రీడా కార్యక్ర మాలు నిర్వహించారు. కృష్ణా చిల్డ్రన్స్ క్లబ్ కన్వీనర్ కీర్తి మాట్లాడుతూ పిల్లలు అన్ని రంగాల్లో ముందుండాలని, మూఢ నమ్మకాలకు వ్యతిరేకంగా ఈ పండుగ మంచి పై చెడు ఎప్పటి కీగెలవలేదని నిరూపించిందని ప్రతి ఒక్కరు మంచి మార్గంలో నడవాలని చదువుతోపాటు మంచి- చెడు తెలుసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పిల్లల ట్యూషన్ టీచర్ శైలజ తోపాటు తల్లిదండ్రులు పాల్గొన్నారు.

బాలా త్రిపుర సుందరికి 1.42 లక్షల వెండి ఆభరణాలు బహూకరణ

కూచిపూడిలోని శ్రీ గంగా బాలా త్రిపుర సుందరి సమేత రామలింగేశ్వర స్వామి దేవస్థానంలోశ్రీ బాలా త్రిపుర సుం

దరి అమ్మవారికి రూ. 1,41,528 విలువైన వెండి, బంగారు ఆభరణాలను సోమవారం కూచిపూడి గ్రామస్తులు భాగవతుల రామ తారకంఇందిరాదేవి దంపతులు బహూకరించారు. దసరా శరన్నవరాత్రులుమ సందర్భంగా అమ్మవారికి బంగారు ముక్కెర, 947 గ్రాముల బరువు గల వెండి కమలాలు, పాదాలు, అభయహస్తం, ఒక జతగజ్జల పట్టాలు ఆలయ ధర్మకర్తల మండలి ద్వారా అర్చకులకు అందజేశారు.

దీక్షా వస్త్రాలు అందజేత

కూచిపూడిలోని శ్రీ గంగా బాలా త్రిపుర సుందరి సమేత రామ లింగేశ్వర స్వామి దేవాలయంలో దసరా శరన్నవరాత్రి వేడుకల సందర్భంగా శ్రీ బాలా త్రిపుర సుందరికి శాశ్వత ఉభయ దాతలుదీక్షావస్త్రాలను సమ ర్పించారు. కూచిపూడి వాస్తవ్యులు భాగవతుల శ్రీరాములు మనుమలు (శ్రీరామనరసింహందంపతులు (హైదరాబాద్) దేవాలయ పాలకమండలి సభ్యులు అర్చకులకు ఇచ్చారు. జోశ్యుల కమలకుమారి, నాగ జగన్మోహనరావు దంపతులకు కుమారుడు వెంకట హరి రామకృష్ణ కుమార్ అరవింద దంప తులు మనుమరాలు అనాహత(అమెరికా) అలంకార వస్త్రాల ను, పసుపు, కుంకుమ, పూజా ద్రవ్యాలను అందజేశారు.

ఘనంగా శరన్నవరాత్రి ఉత్సవాలు ప్రారంభం

విశాలాంధ్ర -పమిడిముక్కల: మండలంలోని పలు దేవాలయాలలో దసరా శరన్నవరాత్రి ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. పమిడిముక్కల శ్రీ పార్వతీశ్వర స్వామి ఆలయంలో అమ్మవారి ని శ్రీ బాలా త్రిపుర సుందరి దేవిగా అలంకరించారు. ఈ సందర్భంగా గణపతి పూజ పుణ్యాహవచనం దీక్షా సంకల్పం చేసి అమ్మ వారి కి ప్రత్యేక పూజలు నిర్వహించారు.మంటాడ తాడంకి కపిలేశ్వరపురం వీరంకిలాకు హనుమంతపురం ఐనంపూడి పైడికొండలపాలెం మేడూరు అగినపర్రు కృష్ణాపురం చోరగుడి శ్రీరంగపురం లలో అమ్మ వార్ల కి ప్రత్యేక అలంకారం లో విశేష పూజలు నిర్వహించారు.

విద్యుత్ కాంతుల నడుమ ఆలయం

నాట్యాచార్యుల ఇలవేల్పైన గంగా బాలా త్రిపుర సుందరి సమ్మెతు రామలింగేశ్వర స్వామి దేవాలయం శరన్నవరాత్రి వేడుకల నిర్వహణకు విద్యుత్ కాంతులతో కళకళలాడుతోంది. దేవాలయ ప్రాంగణంను ఆలయ పాలకమండలి కమిటీ సభ్యుల పర్యవేక్షణలో ఆధునిక రణమైన విద్యుత్తు లైట్లతో అలంకరించారు.

-విశాలాంధ్ర, కూచిపూడి

గుంటూరు-నర్సాపూర్ రైలు వెంట్రప్రగడ స్టేషన్‌లో ఆపండి

విశాలాంధ్ర-పెదపారుపూడి : మండలంలోని వెంట్రప్రగడ రైల్వే స్టేషన్ లో గుంటూరు నుండి నరసాపూర్ వెళ్ళు రైలు ఆపుదల చేసేందుకు సహకరించాలని ఎంపీ వల్లభనేని బాలశౌరిని మండలం లోని వింజంపాడు గ్రామస్తులు విజయవాడలో ప్రత్యక్షంగా కలిసి వినతి పత్రం అందించినట్లు ఆ గ్రామ పెద్దలు పెద్దిబోయిన వెంకటేశ్వరరావు (బాబ్జి), డొక్కు సాంబశివరావు సోమవారం తెలిపారు. ఈ కార్యక్రమంలో కంకిపాడు మార్కెట్ యార్డ్ డైరెక్టర్ వడ్డీ జీవ, జనసేన పార్టీ విజయవాడ నాయకులు చొప్పవరపు రాంబాబు, తదితరులు పాల్గొన్నారు.

రేపు సర్వసభ్య సమావేశం : ఎంపీడీవో

విశాలాంధ్ర-పెదపారుపూడి : మండల సర్వసభ్య సమావేశం ఈనెల 24వ తేదీ మధ్యాహ్నం గం:3:00లకు ఎంపీపీ గోగం సురేష్ అధ్యక్షతన జరుగుతున్నందున మండలంలోని అధికారులు పూర్తి సమాచారంతో హాజరవ్వాలని ఎంపీడీవో జె.విమాదేవి ఒక ప్రకటనలో సోమవారం తెలిపారు.

చిరస్మరణీయురాలు వీరమాచనేని సరోజిని

విశాలాంధ్ర-తెనాలి : ఆంధ్రప్రదేశ్‌లో ప్రజానాట్యమండలి కమ్యూనిస్టు పార్టీ సాంస్కృతిక కళారంగాన్ని ప్రజల్లో బహుళ ప్రచారం చేసి ఉధ్రుతలూగించిన గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్ విజేత వీరమాచనేని సరోజిని ప్రజల హృదయాలలో చిరస్థాయిగా నిలిచిపోయారని ఇస్కఫ్ రాష్ట్ర కార్య వర్గ సభ్యురాలు శ్రీదేవి నివాళులర్పించారు. స్థానిక గాంధీనగర్ హాలులో ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్య మండలి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అమర కళా కారుల సంస్మరణ సందర్భంగా వీరమాచినేని సరోజిని, తాపీ రాజమ్మ, సావిత్రిల సంస్మరణ సభ జరిగింది. సభకు ఇస్కఫ్ నాయకురాలు పి.శ్రీదేవి అధ్యక్షత వహించారు. ఆమె మాట్లాడుతూ ఆడ వాళ్లు బయటకు రాని రోజుల్లోనే ఎన్నో అవాం తరాలను ఎదుర్కొని పట్టుదలతో తన 13వ ఏట రెండవ ప్రపంచ యుద్ధం రోజుల్లో ప్రజానాట్య మండలిలో రంగ ప్రవేశం చేసిన బాలిక సరోజినీ అన్నారు. కోలాటం, బుర్రకథ, నాటక, నాటిక, జానపద కళారూపాల్లో పాటల్లో దిట్ట అన్నారు. కమ్యూనిస్టు పార్టీ నాటకాలు పోతుగడ్డ, ఇనుప తెరలు, అపనింద, మాభూమి, గాలి మేడలు తది తర నాటకాల్లో డాక్టర్ గరికపాటి రాజారావు, మిక్కి లినేని లాంటి పుద్దండ కళాకారులతో నటించారని

చెప్పారు. సుంకర కష్ణజీవి, బుర్రకథ, తాపీ రాజమ్మ కొండేపూడి రాధాలతో రాష్ట్ర వ్యాప్తంగా వేల సంఖ్యలో ప్రదర్శనలు ఇచ్చారని చెప్పారు. ఆమె నటన, కథాగానాన్ని చూసిన అలనాటి ఉద్దండ కమ్యూనిస్టు పార్టీ నాయకులు చంద్ర రాజేశ్వర రావు, పుచ్చలపల్లి సుందరయ్య, పీసీ జోషి తదితర నాయకులు ప్రశంసించి ఆశీర్వదించారన్నారు. ముద్దుగా మా సరోజినీ అని ప్రశంసించే వారిని ఆనాటి పత్రిక వ్యాసాల్లో పేర్కొన్నారని చెప్పారు. రైతు మహాసభల్లో చురుకుగా పనిచేసేవారన్నారు. మహిళాదళాలను తయారుచేసి ప్రదర్శనలు ఇచ్చా రని, ఉద్యమాల్లో పోరాటాల్లో మమేకమయ్యేవారని అన్నారు. పార్టీలో పనిచేస్తున్న వీరమాచినేని మధు సూదన్‌రావు డైరెక్టర్‌తో పార్టీ వివాహం జరిపార న్నారు. మద్రాసు చేరి మహిళా నాట్యమండలి శాఖ లు ఏర్పాటు చేశారని ఆమె స్ఫూర్తితో నేటి కళాకా రులు ముందుకు సాగాలన్నారు. ప్రముఖ నాయకురాలు సీహెచ్ అనురాధ మాట్లాడుతూ సినిమాల్లో డబ్బింగ్ చెబుతూ నాటిక నాటకాలు రాసి ప్రదర్శనలు ఇచ్చారని చెప్పారు. మహానటి సావిత్రితో ఆలోచన చేసి తాను మాటలు రాసి అందరూ మహిళ కళాకారులతో మాత పిక్చర్స్‌ను స్థాపించి సావిత్రి దర్శకత్వంతో స్త్రీలే అన్ని శాఖలు నిర్వహించి చిన్నారి పాపలు చిత్రం నిర్మించార న్నారు. ఆ చిత్రం అంతర్జాతీయంగా గుర్తింపు పొంది గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్ విజేతని చేసిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం నంది అవార్డుతో సత్కరించిందన్నారు. సినీ వినీలాకాశంలో ప్రప్రథ మంగా కళా రచయితగా సరోజినిని ప్రజలు పత్రి కలు ప్రశంసించాయన్నారు. ఎన్టీ రామారావు ఆనా డు రాయలసీమ కరువు బాధితుల సహాయార్థం ఏర్పాటు చేసిన యాత్రలో కుమార్తె జబ్బుతో ఉన్న యాత్రలో పాల్గొన్నారని, అది రామారావు ప్రతి సభలో ప్రకటించారన్నారు. సరోజినీ లాంటి కళా కారుల అనుభవాలు జ్ఞాపకాలు వరల్డ్ హిస్టరీగా తెలుగు యూనివర్సిటీలు రికార్డు చేయాల్సిన అవ సరం ఉందన్నారు. మద్రాసులో కూడా ప్రచార సభలో పాల్గొనేవారని చెప్పారు. ఇస్కఫ్ నాయకు రాలు బెజ్జంకి నాగమణి సభా పరిచయం చేశారు. కార్యక్రమంలో పి.సునీత, ఏ.బేబీ రాణి, కె.వెంకటేశ్వరమ్మ, బొల్లి ముంత కృష్ణ, బాలస్వామి, మార్కండేయులు తదితరులు పాల్గొన్నారు.

27న ఏఎల్‌బీఈడీ కళాశాల ప్లాటినం జూబ్లీ వేడుకలు

ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్తేరు సునీల

విశాలాంధ్ర-గుంటూరు సిటీ: ఏఎల్‌బీఈడీ కళాశాల స్థాపించి 75 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా ఈ నెల 27వ తేదీన కళాశాల ప్రాంగణంలో

ప్లాటినం జూబ్లీ వేడుకలు నిర్వహించనున్నట్లు వేడుకల కమిటీ సభ్యులు, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మాదాసు ఎస్తేరు సునీల తెలిపారు. సోమవారం కళాశాలలో జరిగిన విలేకరుల సమావేశంలో ఎస్తేరు సునీల మాట్లాడారు. ప్లాటినం జూబ్లీ వేడుకలకు ముఖ్యఅతిథిగా గుంటూరు పార్లమెంటు సభ్యులు, కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ హాజరుకానున్నట్లు పేర్కొన్నారు. కళాశాలలో చదివిన పూర్వ విద్యార్థులు వివిధ రంగాలలో ఉన్నత స్థానంలో ఉన్నారన్నారు. పూర్వ విద్యార్థులందరూ దీనిని ఆహ్వానంగా భావించి తప్పకుండా ప్లాటినం జూబ్లీ వేడుకలలో పాల్గొనాలని తెలిపారు. ఈ సందర్భంగా కళాశాల పూర్వ చరిత్ర గురించి ఆమె మాట్లాడుతూ 1950లో ఆంధ్ర క్రైస్తవ కళాశాల నందు ఒక బ్రాంచీగా ఈ కళాశాల ఉందన్నారు. దాదాపు 15 సంవత్సరాల పాటు అక్కడ కొనసాగిన తదుపరి 1965లో ఏఎల్ ఎడ్యుకేషన్ ఇనిస్టిట్యూట్‌గా మారిందని, 1970లో ఇప్పుడున్న మూడు అంతస్తుల ప్రత్యేక బిల్డింగ్‌లోకి కళాశాలను మార్చడం జరిగిందన్నారు. 1972-73లో ఎంఈడి కోర్సు కో ఎడ్యుకేషన్‌గా ప్రారంభించడం జరిగిందన్నారు. 1977 వరకు ఆంధ్ర యూనివర్సిటీ గుర్తింపులో ఉన్న బీఈడీ కళాశాల, 77 నుంచి ఆచార్య నాగార్జున యూనివర్సిటీ గుర్తింపులోనికి వచ్చిందన్నారు. 1980లో నాగార్జున యూనివర్సిటీ రీసెర్చ్ సెంటర్‌గా ఏఎల్ బీఈడీ కళాశాలను గుర్తించిందన్నారు. 1984లో బీఈడీ కోర్సును కో ఎడ్యుకేషన్‌గా తెచ్చారనీ ఈ విధంగా దినదిన ప్రవర్థమానం చెందుతూ ఏఎల్‌బీఈడీ కళాశాల 75 సంవత్సరాలు పూర్తి చేసుకోవడం మాకు ఎంతో సంతోషాన్ని ఇచ్చిందన్నారు. కళాశాల ప్లాటినం జూబ్లీ వేడుకలను అత్యంత ఘనంగా నిర్వహించటానికి కమిటీ నిర్ణయించిందని ప్రతి పూర్వ విద్యార్థి కూడా ఈ కార్యక్రమంలో పాల్గొనాలని ఆమె పేర్కొన్నారు. ఈ సమావేశంలో ప్లాటినం జూబ్లీ కమిటీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

బస్సు షెల్టర్ శుభ్రం చేసిన ఎన్ఎస్ఎస్ వలంటీర్లు

విశాలాంధ్ర-దుగ్గిరాల: రేవేంద్రపాడు గ్రామంలో సోమవారం కెఎల్ యూనివర్సిటీ ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో అపరిశుభ్రంగా ఉన్న బస్సు షెల్టర్ ను శుభ్రపరిచినట్లు యూనివర్సిటీ

ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ పి. శ్రీకాంత్ రెడ్డి తెలిపారు. స్వచ్ఛత హీ సేవా కార్యక్రమంలో భాగంగా ఏబీఎస్ ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు సేవా కార్యక్రమంలో పాల్గొన్నట్లు ఆయన పేర్కొన్నారు. అనంతరం విద్యార్థులు ఇంటింటికి వెళ్లి పరిసరాల పరిశుభ్రత గురించి అవగాహన కల్పించారు. ఇంటిని, పరిసరాలను శుభ్రంగా ఉంచుకుంటే ఆరో గ్యమైన వాతావరణం ఉంటుందని వివరించారు. కార్యక్రమానికి ఎన్ఎస్ఎస్ ఫీల్డ్ కోఆర్డినేటర్ పి.సురేష్ సమన్వయకర్తగా వ్యవహరించగా వాలంటీర్లను యూనివర్సిటీ వీసీ డాక్టర్ జి.పార్థసారథి వర్మ, ప్రో వీసీలు డాక్టర్ ఏవీఎస్. ప్రసాద్, డాక్టర్ ఎన్. వెంకట్రామ్, డాక్టర్ కె. రాజశేఖరరావు, స్టూడెంట్ అఫైర్స్ డీన్ డాక్టర్ కెఆర్ఎస్. ప్రసాద్, సలహాదారులు డాక్టర్ హబీబుల్లాఖాన్ అభినందించగా గ్రామ సర్పంచ్ పి.మరియమ్మ సహకారం అందించారు.

వంశీ హైస్కూల్‌లో దసరా ఉత్సవాలు

విశాలాంధ్ర-తాడేపల్లి : ఉండవల్లి సెంటర్‌లో గల వంశీ హైస్కూల్లో సోమవారం దసరా ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ

ఉత్సవాల్లో విద్యార్థులు వివిధ నృత్య ప్రదర్శనలు, దశావతారాలు ప్రదర్శించారు. దశావతారాల్లో పది అలంకారాలలో విద్యార్థులు ఎంతో రమ్యంగా, మనోహరంగా ముస్తాబై విద్యార్థులు, తల్లిదండ్రులను ఆకట్టుకున్నారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు రాజా మాస్టర్ మాట్లాడుతూ దసరా అంటే చెడుపై మంచి విజయం సాధించడమని చెప్పారు. ఆ స్ఫూర్తితో మంచిని ప్రోత్సహించి ముందుకుసాగాలని విద్యార్థులకు పిలుపునిచ్చారు.

లలితా హాస్పిటల్‌లో మహిళలకు ఉచిత స్క్రీనింగ్ పరీక్షలు

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : స్వస్థ్ నారీ-సశక్తి పరివార్ అభియాన్‌లో భాగంగా లలితా

సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ ప్రాంగణం నందు ఈనెల 22నుంచి అక్టోబర్ 2 వరకు మహిళలకు ఉచిత ఆరోగ్య స్క్రీనింగ్ శిబిరాన్ని నిర్వహించనున్నారు. ఇందులో భాగంగా మహిళలకు సోమవారం చేపట్టిన ఉచిత వైద్య శిబిరాన్ని ఆ హాస్పిటల్ అధినేత, సీనియర్ కార్డియాలజిస్ట్ డాక్టర్ రాఘవ శర్మ ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కుటుంబం, సమాజ శ్రేయస్సు కోసం మహిళల ఆరోగ్యం ఎంతో ముఖ్యమైందన్నారు. ప్రాథమిక దశలోనే గుర్తించి ముందస్తు జాగ్రత్తలు తీసుకోవడం ద్వారా అనేక వ్యాధులను నిరోధించవచ్చని, తద్వారా అవి పెద్ద సమస్యలుగా మారకుండా నివారించ వచ్చని అన్నారు. తొలుత ఉచిత స్క్రీనింగ్ శిబిరం ప్రతి రోజు ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు లలితా హాస్పిటల్ ప్రాంగణం నందు జరుగుతుందని ఆయన తెలిపారు. మహిళలకు ఉచితంగా బీపీ, షుగర్, బరువు, బీఎంఐ, నోటి క్యాన్సర్, రొమ్ము క్యాన్సర్, సర్వైకల్ క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు చేస్తారని, అవసరమైన వారికి ప్యాప్ స్మియర్, అల్ట్రాసౌండ్, బ్రెస్ట్ పరీక్షలు కూడా ఉచితంగా నిర్వహించి నిర్ధారణ చేస్తారని అన్నారు. ఈ వైద్య శిబిరంలో డెంటల్ సర్జన్ డాక్టర్ స్వాతి, గైనకాలజిస్ట్ డాక్టర్ చంద్రహాస్, మెడికల్ ఆంకాలజిస్ట్ డాక్టర్ కావ్య, ఈఎన్‌టీ సర్జన్ డాక్టర్ నఫీజ్, డెర్మటాలజిస్ట్ డాక్టర్ స్వేత, జనరల్ ఫిజీషియన్ డాక్టర్ షాజియా, న్యూరాలజిస్టులు డాక్టర్ వీరమ్మ, డాక్టర్ ఉషా కిరణ్, ఆప్తల్మాలజిస్ట్ డాక్టర్ శైలజ, రేడియాలజిస్ట్ డాక్టర్ జ్యోతి, జనరల్ సర్జన్ డాక్టర్ సాయిప్రియ తదితర వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థికి రామ్ చారిటబుల్ ట్రస్ట్ ఆర్థిక సాయం

విశాలాంధ్ర-తాడేపల్లి : చదువు నిమిత్తం ఓ విద్యార్థికి రామ్ చారిటబుల్ ట్రస్ట్ ఆర్థిక సాయం అందజేసింది. తాడేపల్లి మండలం చిర్రావూరు గ్రామానికి చెందిన

కాటూరి గోపిచంద్ ఎంబీఏ చదువుతూ ఆర్థిక అవసరాల నిమిత్తం ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలుసుకున్న ట్రస్ట్ వ్యవస్థాపకులు, రామ్ హాస్పిటల్ నిర్వాహకులు డాక్టర్ పలగాని శ్రీనివాసరావు సోమవారం ఆ విద్యార్థికి రూ.10 వేలను చెక్కు రూపంలో అందజేశారు. ఈ సందర్భంగా విద్యార్థి తల్లిదండ్రులు డాక్టర్ పలగాని శ్రీనివాసరావుకు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పుర పెద్దలు కంచర్ల కాశయ్య, కాటూరి రాము, లచ్చి తులసి దాస్, పి.నాగబాబు తదితరులు పాల్గొన్నారు.

దసరా ఉత్సవాలు ప్రారంభం

విశాలాంధ్ర-తాడికొండ : నియోజకవర్గ కేంద్రమైన తాడికొండ గిరీశ్వర, మూలస్థానేశ్వర స్వామి దేవస్థాన ఆధ్వర్యంలో దసరా ఉత్సవాలు సోమవారం ప్రారంభమయ్యాయి. సోమవారం శ్రీ బాలా త్రిపుర సుందరి దేవి ఉత్సవాలు జరిగాయి. అలాగే మండలంలోని పలుచోట్ల దసరా ఉత్సవాలు నిర్వహిస్తు న్నారు. దుర్గమ్మ విగ్రహాలను ఏర్పాటు చేసి పూజలు నిర్వహించారు. పొన్నెకల్లు శ్రీ రాజరాజేశ్వరి స్వామివారి దేవస్థానం ఆధ్వర్యంలో ఉత్సవాలు ప్రారంభమయ్యాయి.

మ్యాజిక్ డ్రైన్ నిర్మాణానికి శంకుస్థాపన

విశాలాంధ్ర-దుగ్గిరాల: చింతలపూడి గ్రామంలో మ్యాజిక్ డ్రైన్ నిర్మాణా నికి సోమవారం శంకుస్థాపన చేశారు. ఉపాధి హామీ పథకం ద్వారా డ్రైన్ ఏర్పాటుకు ఎంపీపీ షేక్

జబీన్, మార్కెట్ యార్డ్ చైర్మన్ ఉన్నం ఝాన్సీరాణి, మండల పార్టీ అధ్యక్షురాలు అనిత, సర్పంచ్ తాడిబోయిన రామకృష్ణ పూజలు చేసి శంకుస్థాపన చేశారు. గ్రామంలో 8 మీటర్ల మేరకు కమ్మెల సత్యనారాయణ ఇంటి నుంచి ఎర్రం శెట్టి శివయ్య ఇంటి వరకు ప్రస్తుతం మోడల్‌గా డ్రైన్ ఏర్పాటు చేస్తామని అధికారులు తెలిపారు. చింతలపూడి గ్రామాన్ని ఎంపిక చేసినందుకు మంత్రులు నారా లోకేష్, పవన్ కళ్యాణ్‌కు గ్రామస్తులు, సర్పంచ్ రామకృష్ణ కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో కేజీ నెహ్రూ,పంచాయతీ కార్యదర్శి మణికంఠ,ఉపాధి హామీ ఏపీఓ మధుబాల,జనసేన పార్టీ అధ్యక్షులు పసుపులేటి శ్రీనివాసరావు,పట్టేల శ్రీనివాస్,కోలా రమణ తదితరులు పాల్గొన్నారు.

బాలా త్రిపుర సుందరీదేవిగా భ్రమరాంబదేవి అమ్మవారు

విశాలాంధ్ర-పెదకాకాని : మల్లేశ్వర స్వామి దేవస్థా నంలో సోమవారం దసరా మహోత్సవాలు ప్రారంభ మయ్యాయి. ఉత్సవాలలో భాగంగా భ్రమరాంబదేవి అమ్మవారు బాలాత్రిపుర సుందరీదేవి అలంకా రంలో భక్తులు దర్శించుకున్నారు. ఆలయ ఉప కమిషనరు గోగినేని లీలాకుమార్ అంకురార్పణ పూజ కార్యక్రమంలో పాల్గొన్నారు. దసరా ఉత్స వాలు ఆలయ స్థానాచార్యులు పొత్తూరి సాంబశివ రావు పర్యవేక్షణలో ఉదయం సుప్రభాతసేవ, హార తులు, విఘ్నేశ్వరపూజ, పుణ్యాహవచనములు,

పంచగవ్యప్రాశన, మహన్యాసపూర్వక ఏకాథ రుద్రా భిషేకాలు, నవావరణార్చనలు, సాయంత్రం భ్రమ రాంబదేవి అమ్మవారికి ప్రత్యేక కుంకుమార్చనలు, పంచహారతులు, ఆలయ ప్రదక్షణ, తీర్థప్రసాదాలు వినియోగము జరిగినట్లు ఆలయ ఉపకమిషనరు గోగినేని లీలాకుమార్ తెలిపారు. యాగశాలలో భక్తులు రుద్ర, చండీ హోమములు జరిపించుకు న్నారు. భక్తులు అన్నప్రసాదం స్వీకరించారు. సాంస్కృతిక కార్యక్రమాలలో భాగంగా సాయంత్రం అల్లూరి సుజాత, పెదకాకాని వారిచే భజనా కాలక్షేపము, వేదాంతం కూచిపూడి ఆర్ట్స్ అకాడమీ, విజయవాడ వారిచే కూచిపూడి నృత్యం, సిద్ధయ్య, గుంటూరు వారిచే శ్రీ కృష్ణరాయభారం నాటకం నుంచి పడకసీను, కె.వెంకటేశ్వరరావు, పెదకాకాని వారిచే మోహినీ భస్మాసుర నాటకం నుంచి సీను భక్తులను రంజింపజేశారు.

ఎంపీడీఓగా ఉల్లంగుల బాధ్యతలు

విశాలాంధ్ర-దాచేపల్లి : ఎంపీడీఓగా ఉల్లంగుల వెంకటేశ్వరరావు సోమవారం ఉద్యోగ బాధ్యతలు తీసుకున్నారు. గుంటూరులోని మైనార్టీ వెల్ఫేర్ కార్పొరేషన్ కార్యాలయంలో సూపరింటెండెంట్‌గా పనిచేస్తున్న ఆయనకు ఎంపీడీఓగా పదోన్నతి లభించింది. దాంతో బదిలీపై అక్కడి నుంచి ఇక్కడకు వచ్చారు. స్థానిక కార్యాలయం సూపరింటెండెంట్ దేవరపల్లి వీరయ్య ఇప్పటివరకు ఇన్‌చార్జ్‌గా వ్యవహరించారు. అదేవిధంగా గ్రామ పంచాయతీల్లో సొంత ఆదాయ వనరుల పెంపుపై రెండు రోజుల పాటు జరుగనున్న శిక్షణ తరగతులు సోమవారం ప్రారంభమయ్యాయి. మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ ఉల్లంగుల వెంకటేశ్వరరావు, సూపరింటెండెంట్ దేవరపల్లి వీరయ్య, ఇన్‌చార్జ్ ఈఓపీఆర్డీ స్వామి నాయక్, ఎంటీలు కరీం, సూర్యప్రకాష్, సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

గీతాంజలి స్కూల్స్‌లో దసరా వేడుకలు

విశాలాంధ్ర-వినుకొండ: స్థానిక గీతాంజలి స్కూల్స్ నందు దసరా వేడుకలు సోమవారం ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ తేళ్ళ కృష్ణవేణి మాట్లాడుతూ దసరా పండుగ చెడుపై మంచి సాధించిన విజయం గా ప్రతి ఒక్కరూ నిర్వహించుకోవడం జరుగుతుందని, కావున చిన్నారులు అందరూ చెడుకు దూరంగా వుంటూ మంచిని అలవర్చుకొని విద్యలో రాణిస్తూ, తల్లి దండ్రులు గర్వించే స్థాయికి ఎదగాలని కోరారు. అనంతరం చిన్నారులు పలు సాంస్కృతిక కార్యక్రమాలతో అలరించారు. డైరెక్టర్ వై.లక్ష్మణ కిషోర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

బాలా త్రిపుర సుందరి దేవీగా అమ్మవారు

విశాలాంధ్ర-దాచేపల్లి : దసరా ఉత్సవాల్లో భాగంగా సోమవారం నుంచి దేవీ నవరాత్రుల వేడుకలు ఆరంభమయ్యాయి. శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరీ అమ్మవారి ఆలయం, శ్రీవీర్ల అంకమ్మ తల్లి ఆలయంతో పాటు అమ్మవారి ఆలయాల్లో అన్ని చోట్ల బాలా త్రిపుర సుందరి అలంకరణ చేశారు. భక్తులు, మహిళలు ప్రత్యేక పూజలు చేశారు. బతకమ్మ పాటలు ఆలపించారు.

పీఎస్‌లో సౌరశక్తి ఆధారిత బ్యాటరీ వ్యవస్థ

విశాలాంధ్ర-దాచేపల్లి : పోలీసు స్టేషన్‌లో కొత్తగా ఏర్పాటు చేసిన నాలుగు యూనిట్ల సౌరశక్తి ఆధారిత బ్యాటరీ వ్యవస్థను సోమవారం గురజాల డీఎస్పీ జగదీష్ ప్రారంభించారు. అదేవిధంగా ఆధునీకరిస్తున్న కంప్యూటర్ రూంను కూడా ఆయన పరిశీలించారు. ఈ కార్యక్రమంలో సీఐ భాస్కర్, ఎస్సైలు పాపారావు, సౌందర్ రాజన్‌తో పాటు సిబ్బంది పాల్గొన్నారు.

శరన్నవరాత్రుల మహోత్సవాలు ప్రారంభం

విశాలాంధ్ర-అమరావతి : ప్రముఖ పుణ్యక్షేత్రమైన అమరావతిలో కొలువుతీరి ఉన్న శ్రీ బాల చాముండిగా సమేత అమరేశ్వర స్వామి దేవాలయంలో శరన్నవరాత్రుల మహోత్సవాలు ప్రారంభించారు. ఈ సందర్భంగా రజిత కవచలం కృత దేవి శ్రీ బాల చాముండేశ్వరి దేవిగా దేవాలయ వేదపండితులు అమ్మవారిని అలంకరించి భక్తుల నిమిత్తార్థమై ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా హోమాలు ప్రారంభించారు. క్రతువులను వివిధ ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో వచ్చిన భక్తులు తిలకించారు. అనంతరం స్వామి వారి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

మండలంలో నేటి నుంచి ఆధార్ క్యాంపులు

విశాలాంధ్ర-యద్దపాడు : ఈ నెల 23 నుంచి నాలుగు రోజులు మండలంలో ఆధార్ క్యాంపులు నిర్వహించనున్నట్లు యద్దపాడు ఎంపీడీవో హేమలతా దేవి తెలిపారు. ఈ స్పెషల్ ఆధార్ క్యాంపులు యద్దపాడు-1 సచివాలయం, జగ్గాపురం ఎంపీపీఎస్‌హెచ్‌ఈ పాఠశాలలలో నిర్వహిస్తున్నామన్నారు. మొబైల్ నెంబర్ లింక్ చేయడం, కొత్తగా ఆధార్ నమోదు చేయడం, 5, 15 సంవత్సరాలు దాటిన పిల్లలకు బయోమెట్రిక్ అప్డేట్ చేయడం వంటి సేవలు అందించనున్నారు. ఈ స్పెషల్ ఆధార్ క్యాంపులను వినియోగించుకోవలసినదిగా హేమలతా దేవి కోరారు.

అర్జీల సత్వర పరిష్కారానికి కృషి చేయాలి: కలెక్టర్

విశాలాంధ్ర బ్యూరో-పల్నాడు జిల్లా : ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక(పీజీఆర్ఎస్) వేదికలో అందిన అర్జీల సత్వర పరిష్కారమే లక్ష్యంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ కృతికా శుక్లా ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ఈ కార్యక్రమంలో జిల్లా నలుమూలల నుంచి వచ్చిన అర్జీదారులు నుంచి కలెక్టర్ అర్జీలను స్వీకరించి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కలెక్టర్‌తో పాటు జాయింట్ కలెక్టర్ సూరజ్, జిల్లా రెవెన్యూ అధికారి అర్జీలను స్వీకరించారు. పీజీఆర్ఎస్‌లో 163 అర్జీలు అందాయని అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అర్జీల పరిష్కారంలో ఎటువంటి జాప్యానికి తావులేకుండా నాణ్యతతో పరిష్కరించాలన్నారు. అర్జీదారుని సంతృప్తే ధ్యేయంగా అర్జీల పరిష్కార తీరు ఉండాలని స్పష్టం చేశారు. అర్జీలు రీ-ఓపెన్ కాకుండా పరిష్కార చర్యలు ఉండాలన్నారు. ఫిర్యాదుదారులతో ముఖాముఖీగా మాట్లాడి ఫిర్యాదుదారుల సమస్యలను తెలుసుకుని పూర్తిస్థాయిలో పరిష్కరిస్తామని భరోసా కల్పించారు. జిల్లా అధికారులు వారి శాఖలకు సంబంధించిన అర్జీలను క్షుణంగా పరిశీలించి తమ సిబ్బందితో నిర్ణీత గడువులోగా త్వరితగతిన పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలన్నారు. సమస్యలు తమ పరిధిలోనివి కానప్పుడు వెంటనే సంబంధిత శాఖకు పరిష్కారం కోసం పంపాలని అధికారులకు కలెక్టర్ సూచించారు. కార్యక్రమంలో శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ఎంపీడీఓగా స్వరూపరాణి బాధ్యతలు

విశాలాంధ్ర-రెంటచింతల : మండల అభివృద్ధి అధికారి(ఎంపీ డీఓ)గా ఎస్.స్వరూపరాణి సోమవారం ఉద్యోగ బాధ్యతలు చేప ట్టారు. నాదెండ్ల మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఏఓ, ఎఫ్ఏసీ ఎంపీడీఓగా విధులు నిర్వహిస్తున్న స్వరూపరాణి పదోన్నతిపై రెంటచింతల ఎంపీడీఓగా బదిలీ చేస్తూ పంచాయితీరాజ్ శాఖ కమిషనర్ కృష్ణతేజ ఆదేశాల మేరకు సీఈఓ వి.జ్యోతిబస్సు ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం ఇక్కడ ఎఫ్ఎస్‌ఐసి ఎంపీడీఓ బాధ్యతలు నిర్వహిస్తున్న చినుకూరి శ్రీనివాసరావు పదోన్నతిపై నాదెండ్ల ఎంపీడీఓగా బదిలీపై వెళ్లారు. ఈ సందర్భంగా స్వరూపరాణి మాట్లాడుతూ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు స్థానిక అధికారులు, ప్రజాప్రతినిధుల సహకారంతో మండలాభివృద్ధికి కృషి చేస్తానన్నారు.

24న నైపుణ్యాభివృద్ధి సంస్థ జాబ్ మేళా

విశాలాంధ్ర-పిడుగురాళ్ల : స్కిల్ డెవలప్‌మెంట్ అండ్ ట్రైనింగ్ విభాగం, రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఈ నెల 24న జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ఈ.తమ్మాజీరావు తెలిపారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో 24వ తేదీ జరిగే జాబ్ మేళాలో 10 ప్రముఖ కంపెనీలు పాల్గొంటాయని తెలిపారు. జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ఈ.తమ్మాజీరావు, జూనియర్ కాలేజీ ప్రిన్సిపాల్ బీవీ కృష్ణారెడ్డిలు మాట్లాడుతూ నియోజకవర్గ పరిసర ప్రాంత యువత ఈ జాబ్ మేళాను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. విద్యార్హతను బట్టి జీతం సుమారు రూ.12 వేలు నుంచి రూ.35 వేల వరకు ఉంటుందన్నారు. ఈ జాబ్ మేళాకు ఎస్ఎస్‌సీ, ఇంటర్, ఐటిఐ, డిగ్రీ, బిటెక్, డిప్లొమా, ఫార్మసీ, పీజీ చదువుకున్న 18-35 సంవత్సరాల వయసు గల నిరుద్యోగ యువత వారి బయోడేటాతో హాజరుకావాలని కోరారు. రెస్యూమ్, విద్యార్హత సర్టిఫికెట్స్, ఆధార్ నకలు, పాస్ పోర్ట్ ఫోటోతో నేరుగా ఇంటర్వ్యూకు హాజరుకావాలని చెప్పారు. మేళా ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు జరుగుతుందని, వివరాలకు పి.శ్రీకాంత్-9492158153, సురేష్-9100566581లను సంప్రదించాలని నైపుణ్యాధికారి తమ్మాజీరావు కోరారు.

అమ్మవారిని దర్శించుకున్న మక్కెన

విశాలాంధ్ర - వినుకొండ : వినుకొండ సమీపంలోని కోటప్పనగర్ గ్రామంలో దసరా నవరాత్రులు సందర్భంగా గ్రామస్తులు ఏర్పాటు చేసిన అమ్మవారిని జీడీసీసీ బ్యాంకు ఛైర్మన్ మక్కెన మల్లికార్జునరావు దర్శించుకున్నారు.

నడికూడి జంక్షన్ సందర్శన

విశాలాంధ్ర-దాచేపల్లి : దక్షిణ మధ్య రైల్వే బోర్డు సభ్యురాలు కొంకా రాధ సోమవారం నడికూడి జంక్షన్‌ను సందర్శించారు. స్టేషన్‌లో ఉన్న వసతులతో పాటు సమస్యలను కూడా అడిగి తెలుసుకున్నారు. విశ్రాంతి గదితో పాటు మరుగుదొడ్లు, తాగునీటి కుళాయిలను పరిశీలించారు. ప్రయాణికుల కోసం వాటిలో ఇంకా మెరుగైన సౌకర్యాలు కల్పించాలని అధికారులను ఆదేశించారు. రైల్వే ఉన్నతాధికారులతో కూడా మాట్లాడతానని చెప్పారు. ఆమెతో పాటు కూటమి నాయకులు ఉన్నారు.

పెద్దమద్దూరు వంతెన పూర్తి చేయాలి

విశాలాంధ్ర-అమరావతి : గత వారం రోజుల నుంచి ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాల కారణంగా కృష్ణానది ప్రవాహం పెరగడంతో మండల పరిధిలోని పెద్దమద్దూరు వద్ద వంతెనపై నీటి ప్రవాహం పెరిగి విజయవాడ నుంచి అమరావతి, అమరావతి నుంచి విజయవాడ ఆటోలతో సహా రవాణా ఆగిపోవడంతో ప్రయాణికులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. దీన్ని ప్రభుత్వం దృష్టిలో పెట్టుకొని వంతెన నిర్మాణాన్ని యుద్ధప్రాతిపదిక పూర్తి చేసి ప్రయాణ సౌకర్యార్థం ప్రజలకు అందించాలని డిమాండ్ చేస్తున్నారు. కొద్దిపాటి వర్షం పడిన వాగులు పొంగటంతో అమరావతి మండల పరిధిలోని పెద్దమద్దూరు, వైకుంఠపురం గ్రామాల ప్రజలు అమరావతి రావాలంటే తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నట్లు ప్రజలు వాపోతున్నారు.

మండలంలో స్వచ్ఛ రథం

విశాలాంధ్ర-యద్దపాడు : మండలంలోని సొలస గ్రామంలో స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా సోమవారం స్వచ్ఛ రథంను ప్రారంభించారు. ఎంపీడీవో హేమలతా దేవి ప్రారంభ అనంతరం మాట్లాడుతూ మండలానికి ఒక వెహికల్ కేటాయించారని, స్వచ్ఛ రథం రోజుకి ఒక గ్రామానికి వెళ్లి ఇళ్లలోని తడి చెత్త, పొడి చెత్త వేరు చేయటం, ప్లాస్టిక్, అట్టపెట్టె, పేపర్, ఇనుము, స్టీలు మరియు అల్యూమినియం వస్తువులను తీసుకొని దాని రేటుకు సమానమైన నిత్యావసర వస్తువులను ఇవ్వనున్నట్లు వివరించారు. ప్లాస్టిక్ రహిత గ్రామాలుగా తయారు చేయుట, గ్రామ పంచాయతీలను పరిశుభ్రంగా ఉంచుట, రీసైక్లింగ్ పద్ధతిని పెంపొందించడం మొదలగునవి దీని ద్వారా సాధించవచ్చు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో జాకీర్ హుస్సేన్, పంచాయతి కార్యదర్శి నాగిరెడ్డి, గ్రామ నాయకులు వీరారెడ్డి, గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలకు ప్రధాన ముఖ ద్వారం ఏర్పాటు చేసిన ముత్తినేని

విశాలాంధ్ర - వినుకొండ : స్థానిక నరసరావుపేట రోడ్డులోని ఎన్ఎస్పి కాలనీ, జెడ్పి హైస్కూల్ ముఖ ద్వారం గేట్‌ను దాత ముత్తినేని యశోధరావు సహకారంతో నిర్మించినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు సిహెచ్ వీరప్పయ్య తెలిపారు. వినుకొండ మండలం, నీలగంగవరం వాస్తవ్యులు ముత్తినేని యశోధరావు వారి తల్లిదండ్రులు ముత్తినేని నాసరయ్య, వెంకటమ్మల జ్ఞాపకార్థం రూ. 80వేలతో పాఠశాలకు ముఖద్వారాన్ని ఏర్పాటుచేశారు. పాఠశాలలో 420 మంది విద్యార్థులు, సాంఘిక సంక్షేమ బాలికల వసతి గృహంలో 400 మంది బాలికలు వసతి పొందుతున్నారు. ప్రధాన గేటు ఏర్పాటు చేసినందుకు వార్డెన్ రేణుకమ్మ దాతకు ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు వీరప్పయ్య మాట్లాడుతూ. కొత్తగా ఏర్పాటు అయిన పాఠశాలకు మౌళిక సదుపాయాలు అవసరం ఉందని, ప్రధాన గేటు ఏర్పాటు చేసిన దాతకు మరియు గేటు ఏర్పాటు చేయడంలో చొరవ తీసుకున్న పాఠశాల పీడీ రాధా కృష్ణ మూర్తిలను అభినందించారు. దాత ముత్తినేని యశోద రావు మాట్లాడుతూ. బయట వ్యక్తులతో ప్రతిరోజూ సమస్యలు వస్తున్నాయని పీడీ రాధా కృష్ణ మూర్తి తన దృష్టికి తీసుకొచ్చిన వెంటనే విద్యార్థులకు మేలు చేయాలనే ఉద్దేశంతో ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు ప్రజలకు చేస్తున్న సేవాకార్యక్రమాల స్ఫూర్తితో తన తల్లిదండ్రులు జ్ఞాపకార్థం ప్రధాన గేటును ఏర్పాటు చేయడం సంతోషంగా ఉందని తెలిపారు. దసరా సెలవులు తరువాత గేటు పూర్తిగా అందుబాటులోకి వస్తుందని పాఠశాల పీడీ రాధాకృష్ణ మూర్తి తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు ప్రైమరీ స్కూల్ హెచ్ఎం ఎన్. పద్మజ, ఎలీషా, ఎలిజబెత్ రాణి, గోవిందు నాయక్, రాంబాబు, చంద్రశేఖర్, శాంతి, రామాంజనేయులు, మల్లయ్య, గాయిత్రి, కోటిరత్నం,సంధ్య, వార్డెన్ రేణుకమ్మ, సి ఆర్ పి విశ్వనాథమ్ పాల్గొన్నారు.

అసోసియేషన్ పోరాటాల ఫలితమే 'సున్నా జీఎస్టీ' అమలు

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : ఎల్ఐసీ కస్టమర్ల శ్రేయస్సు కోసం లైఫ్ ఇన్సూరెన్స్ ఏజెంట్స్ అసోసియేషన్ ఎన్నో పోరాటాలు చేసిందని, ఆ పోరాటాల ఫలితమే నేడు ఆరోగ్య భీమా, పలు స్టేషనరీ వస్తువులపై సున్నా జీఎస్టీ అమలయిందని లైఫ్ ఇన్సూరెన్స్ ఏజెంట్స్ అసోసియేషన్ అధ్యక్షులు పి. సుబ్బారావు పేర్కొన్నారు. జీఎస్టీ సంస్కరణల అమలు సందర్భంగా సోమవారం అమరావతి రోడ్డులో ఉన్న లైఫ్ ఇన్సూరెన్స్ ఏజెంట్స్ అసోసియేషన్ కార్యాలయం నందు ప్రధాని మోదీ, కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌కు ధన్యవాదాలు తెలియజేసే కార్యక్రమాన్ని సెక్రటరీలు జగదీష్, జి.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో చేపట్టారు. ఈ సందర్భంగా

సుబ్బారావు మాట్లాడుతూ ఆరోగ్య భీమా, పలు స్టేషనరీ వస్తువులపై సున్నా జిఎస్టి అమలు చేయడం వలన సామాన్య ప్రజలకు ఆర్థిక భరోసా కలుగుతుందన్నారు. పలు నిత్యావసరాలపై 18 శాతం నుంచి ఐదు శాతానికి జీఎస్టీ తగ్గించారని, అదేవిధంగా ఔషధాలపై 12 శాతం నుంచి ఐదు శాతానికి..అలాగే చిన్న కార్లు, బైక్‌లపై 20 శాతం నుంచి 18 శాతానికి, ఏసీలు, టీవీలపై 28 శాతం నుంచి 18 శాతానికి జీఎస్టీ తగ్గించడం వల్ల సామాన్య ప్రజలకు ఆర్థిక వెసులుబాటు కలుగుతుందన్నారు. అనంతరం డివిజన్ వైస్ ప్రెసిడెంట్ భావన్నారాయణ జీఎస్టీ సంస్కరణల ద్వారా ఎల్ఐసి కస్టమర్లకు ఎంతో లబ్ధి కలుగుతుందన్నారు. వ్యవ స్థాపక కార్యదర్శి పి.నాగేశ్వరరావు, జయప్రకాష్ మాట్లాడుతూ వివిధ ఎల్ఐసి పాలసీలు కొత్తగా తీసుకునే వారికి ఎల్ఐసిలో సున్నా జీఎస్టీ లబ్ధి చేకూరుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో వివిఎన్ యామినీ దేవి, వి.వెంకటేశ్వరరావు, సిహెచ్.సాంబశివరావు, గుంటూరు పరిశుద్ధరావు, సిహెచ్.వెంకటేశ్వరరావు, ఎల్ఐసి ఏజెంట్స్, ఎల్ఐసి స్టాఫ్ మెంబర్స్, కస్టమర్స్ పాల్గొన్నారు.

నిర్మల సీబీఎస్ఈ స్కూల్ వద్ద తల్లిదండ్రుల నిరసన

పదవ తరగతి ఒరిజినల్ సిరిఫికెట్లు ఇవ్వాలంటూ ఆగ్రహం

విశాలాంధ్ర-మంగళగిరి : ఆత్మకూరు నిర్మల సీబీఎస్ఈ స్కూల్ వద్ద సోమవారం పదవ తరగతి విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన చేపట్టారు. 2024-25 విద్యాసంవత్సరానికి

సంబంధించిన పరీక్షలు రాసి ఉత్తీర్ణులైన విద్యార్థుల ఒరిజినల్ సర్టిఫికెట్లు పాఠశాల కార్యాలయంలో మాయమైన ఘటనలో స్కూల్ యాజమాన్యం మంగళగిరి రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు అనంతరం ఢిల్లీలోని సీబీఎస్ఈ బోర్డు నుంచి డూప్లికేట్ సర్టిఫికెట్లు జారీ అయ్యాయి. అయితే వాటి పంపిణీ గురించి యాజమాన్యం తమకు సమాచారం ఇవ్వడం లేదని తల్లిదండ్రులు ఆరోపించారు. తమ పిల్లల భవిష్యత్తు గురించి అడుగుతున్నప్పుడు స్కూల్ యాజమాన్యం దురుసుగా ప్రవర్తిస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో స్కూల్ గేటు వద్ద తల్లిదండ్రులు బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సమయంలో మంగళగిరి రూరల్ పోలీసులు అక్కడికి చేరుకుని నిరసన చేస్తున్న తల్లిదండ్రులలో ఒకరిని అరెస్ట్ చేశారు. కేసు విచారణలో ఉండగా నిరసనలు తెలపడం సబబు కాదని, విద్యార్థుల భవిష్యత్తు దృష్ట్యా శాంతియుతంగా యాజమాన్యాన్ని కలిసి సమస్యను పరిష్కరించుకోవాలని మంగళగిరి రూరల్ ఎస్ఐ చిరుమామిళ్ల వెంకట్ తల్లిదండ్రులకు సూచించారు. కేసును త్వరితగతిన విచారించి విద్యార్థులకు తగిన న్యాయం జరుగుతుందని పోలీసులు హామీ ఇవ్వడంతో తల్లిదండ్రులు శాంతించారు.

పారదర్శకతతో ఫిర్యాదుల పరిష్కారానికి కృషి

విశాలాంధ్ర-గుంటూరు కలెక్టరేట్ : పీజీఆర్ఎస్ ద్వారా పారదర్శకతతో వేగంగా ప్రజల ఫిర్యాదుల పరిష్కారానికి కృషి చేస్తామని గుంటూరు జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ తెలిపారు. ఎస్పీ ఆదేశాల మేరకు గుంటూరు జిల్లా పోలీస్ కార్యాలయ కాన్ఫరెన్స్ హాల్‌లో ప్రజా ఫిర్యాదులు-పరిష్కారాల వ్యవస్థ కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించి, అదనపు ఎస్పీ(అడ్మిన్) రమణమూర్తి, ఇతర పోలీస్ అధికారులు ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. పౌరుల ఫిర్యాదులపై త్వరితగతిన చర్యలు తీసుకుని, పరిష్కారం జరిగే వరకు పర్యవేక్షించాలని సంబంధిత పోలీస్ అధికారులకు ఎస్పీ ఆదేశించారు. ప్రజలకు పారదర్శకతతో కూడిన వేగవంతమైన సేవలు అందించడం ప్రధాన ఉద్దేశ్యంగా కృషి చేయాలని సూచించారు. పోలీస్ సిబ్బంది ప్రతి ఫిర్యాదును ఆన్‌లైన్‌లో రిజిస్టర్ చేసి, దానికి సంబంధించి నిర్ధార పత్రం ఫిర్యాదుదారులకు అందజేశారు. ప్రజలు 1100 అనే టోల్ ఫ్రీ నెంబర్‌కి డయల్ చేయడం ద్వారా ప్రతి ఫిర్యాదు పరిష్కార స్థాయిని తెలుసుకునే సౌకర్యం ఉంటుందని తెలిపారు. వెస్ట్ డీఎస్పీ అరవింద్ ఫిర్యాదుదారుల వద్దకు వెళ్ళి వారి ఫిర్యాదులను స్వీకరించారు. డీఎస్పీ భానోదయ తదితరులు పాల్గొన్నారు.

తెలుగు వైతాళికుడు గురజాడ అప్పారావు

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : దేశమంటే మట్టికాదోయ్ దేశమంటే మనుషులోయ్ అని ఎలుగెత్తి చాటిన తెలుగు వైతాళికుడు

గురజాడ అప్పారావు అని, బాల్య వివాహాలు, కన్యాశుల్కం వంటి సాంఘిక దురాచారాలను ఎదిరించిన గొప్ప సంస్కర్త గురజాడ అప్పారావు అని సాహితీవేత్త ముప్పాళ్ళ వీవీస్ ప్రసాదరావు కొనియాడారు. స్థానిక అవగాహన సంస్థ కార్యాలయంలో ప్రముఖ సాహితీవేత్త, సంఘ సంస్కర్త గురజాడ అప్పారావు జయంతి కార్యక్రమం సోమవారం జరిగింది. ఈ సందర్భంగా ప్రసాదరావు మాట్లాడుతూ బెంగాల్ భాషకు ఠాగూర్‌లా తెలుగు భాషోద్ధరణకు తెలుగు వ్యవహారిక భాషా వినియోగానికి గురజాడ ఎనలేని కృషి చేశారని ప్రశంసించారు. కవి జమదగ్ని మాట్లాడుతూ గురజాడ కన్యాశుల్యం నాటకం ద్వారా సంఘ దురాచారాలను ప్రతిఘటించటంతో పాటు తెలుగులో వాడుక భాషా ప్రచారాన్ని కూడా చేపట్టారన్నారు. ఆయన గేయగాథ, పుత్తడిబొమ్మ-పూర్ణమ్మ కఠినాత్ములైనా కరిగించేలా కంటతడి పెట్టించేలా చేసిందన్నారు. ఈ కార్యక్రమంలో విద్యావేత్త చంద్రయ్య, ఘనశ్యామాచార్యులు ప్రసంగించారు.

రోడ్డు ప్రమాదం.. ఒకరి మృతి

విశాలాంధ్ర-మేడికొండూరు : గుంటూరు-మాచర్ల ప్రధాన రహదారిపై సోమవారం ఉదయం జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో ఒక గొర్రెల కాపరి మృతి చెందగా మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన మేడికొండూరు పోలీస్ స్టేషన్ పరిధిలోని భీమినేనివారిపాలెం వద్ద జరిగింది. భీమినేని వారిపాలెం గ్రామానికి చెందిన తోక శ్రీను(43), పాలపర్తి రమేష్(40) తమ గొర్రెల మందను మేపుకునేందుకు రోడ్డుపై నడుచుకుంటూ వెళుతున్నారు. అదే సమయంలో గుంటూరు నుంచి మాచర్ల వైపు అతి వేగంగా వస్తున్న కారు వెనుక వైపు నుంచి వారిని ఢీకొట్టింది. కారును నడుపుతున్న వినుకొండకు చెందిన షేక్ అబ్దుల్ నిద్రమత్తులో ఉండటమే ప్రమాదానికి కారణమని పోలీసులు తెలిపారు. ఈ ప్రమాదంలో తోక శ్రీను అక్కడికక్కడే మృతి చెందగా, పాలపర్తి రమేష్ తీవ్ర గాయాలతో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఈ ప్రమాదంలో ఒక గొర్రె చనిపోగా నాలుగు గొర్రెలకు కాళ్ళు విరిగాయి. విషయం తెలిసిన వెంటనే మేడికొండూరు పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. కారు డ్రైవర్ పరారీలో ఉన్నాడు. మేడికొండూరు సీఐ నాగూర్ మీరా సాహెబ్ ఈ సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రికి తరలించారు.

డయేరియా ప్రాంతాల్లో డ్రైన్ల క్లీనింగ్ పనులు చేపట్టాలి : కమిషనర్

విశాలాంధ్ర-గుంటూరు సిటీ: నగర పాలక సంస్థ పరిధిలో డయేరియా అనుమానిత, నిర్ధారిత ప్రాంతాల్లో యుద్ధప్రాతిపదికన డ్రైన్ల క్లీనింగ్, ఆక్రమణల తొలగింపు, ఆర్.ఓ ప్లాంట్ల వివరాల సేకరణ, డయేరియా నిర్ధారణ అయిన వారి నుండి సమగ్ర వివరాల సేకరణ చేయాలని, కేటాయించిన విధుల్లో నిర్లక్ష్యంగా ఉండేవారి పై క్రమశిక్షణా చర్యలతో పాటు క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు స్పష్టం చేశారు. సోమవారం నగర పాలక సంస్థ కౌన్సిల్ సమావేశ మందిరంలో ఇంజనీరింగ్, ప్రజారోగ్య, పట్టణ ప్రణాళిక అధికారులతో అత్యవసర సమావేశం నిర్వహించారు. కమిషనర్ మాట్లాడుతూ, నగరంలో డయేరియా కేసులు నమోదౌతున్నందున అన్ని విభాగాల అధికారులు సమన్వయంతో అత్యవసర ప్రాధాన్యతా క్రమంలో విధులు నిర్వహించాలన్నారు. మంగళవారం సాయంత్రానికి కేసులు నమోదైన ప్రాంతాలలో త్రాగు నీటి పైపులైన వ్యవస్థ, డ్రైన్లలో పూడికతీత, చెత్త డంపింగ్ పాయింట్స్, భవన నిర్మాణ వ్యర్థాలపై మూడు విభాగాల అధికారులు సమగ్ర సర్వే చేసి నోడల్ ఆఫీసర్ ద్వారా నివేదిక ఇవ్వాలన్నారు. అలాగే వార్డు సచివాలయాల వారీగా శానిటేషన్ కార్యదర్శులు, ఆర్ఓ ప్లాంట్లు వాటి అనుమతుల పై నివేదిక ఇవ్వాలన్నారు. డ్రైన్ల పై ఆక్రమణలను రాజీ లేకుండా తొలగించాలని పట్టణ ప్రణాళిక అధికారులను ఆదేశించారు. క్షేత్ర స్థాయిలో విధులు కేటాయించబడిన ప్రతి ఒక్కరు అంకిత భావంతో విధులు నిర్వహించాలని అన్నారు. సమావేశంలో అదనపు కమిషనర్ చల్లా ఓబులేసు, డిప్యూటీ కమిషనర్లు డి. శ్రీనివాసరావు, సి.హెచ్ శ్రీనివాస్, బి.శ్రీనివాసరావు, సిటీ ప్లానర్ రాంబాబు, ఎస్ఈ ఇంచార్జ్ సుందర రామిరెడ్డి, ఎంహెచ్ఓ డాక్టర్ లక్ష్మి నారాయణ, మేనేజర్ బాలాజీ బాష, అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

మస్తాన్‌వలి చిత్రపటానికి పాలాభిషేకం

విశాలాంధ్ర-గుంటూరు కలెక్టరేట్ : సాంఘిక సంక్షేమ ఇంటిగ్రేటెడ్ హాస్టల్ ప్రారంభించడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ... హాస్టల్ ఏర్పాటులో కీలకపాత్ర పోషించిన మాజీ ఎమ్మెల్యే షేక్ మస్తాన్‌వలికి శుభాకాంక్షలు తెలియజేస్తూ ఎన్ఎస్‌యూఐ ఆధ్వర్యంలో సోమవారం ఆయన చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఎన్ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షులు షేక్ కరీం మాట్లాడుతూ 2009 నుండి 2014 వరకు గుంటూరు తూర్పు నియోజకవర్గ శాసనసభ్యులుగా మస్తాన్ వలి ఉన్న సమయంలో ఉమ్మడి గుంటూరు జిల్లా వ్యాప్తంగా 400 మంది విద్యార్థులు నివసించే సాంఘిక సంక్షేమ ఇంటిగ్రేటెడ్ హాస్టల్‌ను గుంటూరు తూర్పు నియోజకవర్గంలో నిర్మాణం చేయాలనే ఒక గొప్ప ఆలోచనతో ఆనాడు అసెంబ్లీలో పోరాటం చేసి జీఓ తెచ్చి నిర్మాణ పనులు ప్రారంభించడం జరిగిందన్నారు. కానీ నిర్మాణ సమయంలో అధికారం కోల్పోవడంతో ఎక్కడ పనులు అక్కడే నిలిచిపోయాయని, సుమారు 11 సంవత్సరాల నుంచి విద్యార్థి సంఘాలు, ఎస్సీ, ఎస్టీ, బీసీ సంఘాల పోరాట ఫలితంగా ఇప్పటికైనా హాస్టల్‌ను ప్రారంభించడం సంతోషకరమని అన్నారు.

కనపడుట లేదు

పేరు:తెలుకుట్ల సురేష్ బాబు, (ఆర్మీ సిపాయి), తండ్రి:తెలుకుట్ల సాంబశివరావు, వయస్సు:35 సం॥లు, ఎత్తు:6 అడుగులు,రంగు: ఎరుపు అడ్రస్: పాములపాడు(గ్రా), తాడికొండ(మం), గుంటూరు జిల్లా. పై తెలిపిన వివరములు గల వ్యక్తి జనవరి నెల, 2025సం॥ నుండి కనపడుట లేదు. ఆచూకి తెలిపిన వారికి తగిన పారితోషకం ఇవ్వబడును. సంప్రదించవలసిన ఫోన్ నెంబర్లు: 9542572904, 8499002735

BEFORE THE HON'BLE DEPUTY REGISTRAR OF CHITS: GUNTUR
(Application for reference of a Dispute to Arbitration)
DISPUTE No. 126 / 2024
BETWEEN :
M/s Dhanalakshmi Srinivasan Chit Funds (Andira) Pvt. Ltd., Guntur Rep. by its Manager/Foreman. ..Disputant
Vs
Mr. M.N.V. RAVIKUMAR & Others ...Opponents
Opponent No 1: Mr.Musam Naga Venkata Ravi Kumar, S/o.M. Sri Ramulu, Prop Sri Mahalakshmi Jewellery Works, Shop No.3, Bhano Complex, Sharaf Bazar, Mangalagiri, Guntur Dist. Residing at D.No.11-434, 2 Line NCC.Road, Old Mangalagiri, Mangalagiri (Po & MD), Guntur Dist.
Opponent No 2: Mr.Bandaru Sudhakar, S/o B.Narasimha Rao, Residin at D.No. 11-459/A, Near Hussain Katta, Old Mangalagiri, Mangalagiri (Po & MD), Guntur Dist.
Opponent No 5:Mrs.Musam Kalyani, W/o.M.N. V. Ravi Kumar, Aged 38 year, Residing at D No. 11-434, 2 Line N.C.C. Road, Old Mangalagiri, Mangalagiri (Po & MD), Guntur Dist.
Please take notice that the above Dispute is filed against Opp. No's.1,2 & 5 of you and Five others for recovery of Rs.4,97,362/- (Rupees four lakhs ninety seven thousand three hundred and sixty two only) and the same is posted on **28.10.2025** for the appearance of you before the Hon'ble Deputy Registrar of Chits, Guntur at **10:30 A.M.** either in person or through an Advocate. If you fail on that day the matter will be heard and decided Ex-parte basis on the material available.
(By the order of the Deputy Registrar of Chits)
M/s. Dhana Lakshmi Srinivasan Chit Funds, (Andhra) Pvt. Ltd., Guntur.
Rep. by its Branch Manager/ Foreman

శ్రీ వేంకటేశ్వర ఆయుర్వేదిక్ హాస్పిటల్‌లో 'ఉచిత ఓపీ'

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : జాతీయ ఆయుర్వేద దినోత్సవం సందర్భంగా శ్రీ వేంకటేశ్వర ఆయుర్వేదిక్ హాస్పిటల్ నందు మంగళవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఉచితంగా ఓపీ చూడబడుతుందని వేంకటేశ్వర ఆయుర్వేదిక్ హాస్పిటల్ చైర్మన్, ఆయుర్వేద అండ్ కేరళ పంచకర్మ వైద్య నిపుణులు డాక్టర్ కొండా వేంకటేశ్వర్లు సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి భాష్యం స్కూల్ అధినేత భాష్యం రామకృష్ణ ముఖ్య అతిధిగా విచ్చేసి శిబిరాన్ని ప్రారంభించనున్నారని, కీళ్ళ



డా॥ కొండా వేంకటేశ్వర్లు

నొప్పులు, డిస్క్ సమస్యలు, సయాటికా, పక్షవాతం, మోకాళ్ళ అరుగుదల, ఆస్తమా, ఎలర్జీలు, అధిక బరువు, చర్మ వ్యాధులు, సోరియాసిస్, ఫైల్స్, వెన్నుపూస సంబంధిత వ్యాధులు, దీర్ఘకాలిక ఆరోగ్య సమస్యలకు ఈ శిబిరం నందు ఉచితంగా చూసి మందులు ఇవ్వటం జరుగుతుందన్నారు. పరిసర ప్రాంత ప్రజలందరూ ఈ ఉచిత వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అలాగే ఆయుర్వేద ప్రయోజనాలు..ప్రభావిత మూలికలు..ఆరోగ్య పరిరక్షణ ప్రాముఖ్యతను..అవగాహన కల్పించటం జరుగుతుందన్నారు. అలాగే ఆయుర్వేదంపై అవగాహన కార్యక్రమాలు, ఆరోగ్య శిబిరాలు నిర్వహించాలన్న ఉద్దేశ్యంతోనే ప్రభుత్వం ఈ దినోత్సవాన్ని ఉత్సవంగా జరుపుతుందని అన్నారు. శరీర ఆరోగ్యంపై కాకుండా వ్యాధుల నివారణ, ఆరోగ్యకరమైన జీవనశైలిపై ఆయుర్వేదం దృష్టి పెడుతుందని డాక్టర్ కొండా వేంకటేశ్వర్లు వెల్లడించారు.

దస్తావేజు పోయినది

గుంటూరు జిల్లా, పెదకాకాని మండలం, కొప్పురావూరు గ్రామం, డోరు నెం. 4-39రు కాపురస్తులు లేటు దేవప్రాజు రామచంద్రరావు గారి భార్య మద్దాలి హేమలత (సెల్: 8639763957) తెలియజేయునది. నా పేరిట మరియు నా భర్త దేవప్రాజు రామచంద్రరావు గారి పేరిట జాయింటుగా ది.16-02-1989న శ్రీ తాడికొండ సబ్ రిజిస్ట్రారు వారి కార్యాలయంలో రిజిష్టరు కాబడిన విక్రయ దస్తావేజు నెం.133/1989రు ఒరిజినల్‌ను ది.28-08-2025న నగరంపాలెం మూడు బొమ్మల సెంటర్ నుండి గుంటూరు జిల్లా రిజిస్ట్రారు వారి కార్యాలయం వద్దకు జిరాక్సు నిమిత్తం వెళ్ళుచుండగా పోగొట్టుకున్నాను. ఎవరికైనా దొరికిన యెడల పై చిరునామాలో తెలియజేయగలరు.

ఈవీఎం గోడౌన్ పరిశీలన

విశాలాంధ్ర-గుంటూరు సిటీ: త్రైమాసికా తనిఖీలలో భాగం గా సోమవారం స్థానిక కలె క్టరేట్ ఆవరణలోని ఈవీఎంలు భద్రపరిచిన గోడౌన్‌ను రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వివేక్ యాదవ్, జిల్లా కలెక్టర్ ఎ.తమీమ్ అన్సారియా, సంయుక్త కలెక్టర్ అశుతోష్ శ్రీవాత్స, గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో ఓపెన్ చేసి గోడౌన్ నందు గల భద్రతా ప్రమాణాలను పరిశీలించారు. సిసిటివి పనితీరు, అగ్నిమాపక పరికరాలను పరిశీలించారు. ఈవీఎంల భద్రత విషయంలో రాజీపడకుండా అవసరమైన అన్ని చర్యలు పకడ్బందీగా చేపట్టాలని వివేక్ యాదవ్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డీఆర్వో ఖాజావలి, ఆర్డీఓ కె.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

కామినేని సామ్రాజ్యంకు సీపీఐ నాయకుల నివాళి

విశాలాంధ్ర-దుగ్గిరాల : మండలం పరిధిలోని తుమ్మపూడి గ్రామంలో సీపీఐ సీనియర్ నాయకులు కామి నేని భాస్కరరావు సతీమణి సామ్రాజ్యం(80) ఆదివారం రాత్రి అనారోగ్య కారణంగా మృతి చెందారు. ఆమె భౌతికకాయానికి దుగ్గిరాల మండల కార్యదర్శి సయ్యద్ కరీముల్లా పార్టీ పతాకాన్ని కప్పగా సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి చిన్ని తిరు పతయ్య, నియోజకవర్గ సహాయ కార్యదర్శులు కంచర్ల కాశయ్య, యార్లగడ్డ వెంకటేశ్వరరావు, మండల కార్యదర్శి జాలాది జాన్ బాబు, ముసునూరు సుహాస్, జవ్వాది సాంబశివరావు, వెంకటేశ్వరరావు, యార్లగడ్డ శివయ్య, సైకం శివయ్య, ఎస్‌కె కరీముల్లా, జోజి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.

వెంకాయమ్మకు సీపీఐ నేతల ఘన నివాళి

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ)సీనియర్ నాయకులు సీహెచ్.కృష్ణ భార్య వెంకాయమ్మ (86) సోమవారం ఉదయం మరణించారు. విషయం తెలుసుకున్న సీపీఐ గుంటూరు నగర కార్యదర్శి ఆకిటి అరుణ్ కుమార్, సీనియర్ నాయకులు నూతలపాటి చిన్న, నగర కమిటీ సభ్యులు జంగాల చైతన్య, రాగం చంద్రమౌళి తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా అరుణ్ కుమార్ మాట్లాడుతూ పాత గుంటూరు ప్రాంతంలో వెంకాయమ్మ భారత కమ్యూనిస్టు పార్టీ కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొంటూ పార్టీ అభ్యున్నతికి కృషి చేశారని కొనియాడారు. వెంకాయమ్మ ఆరుగురు సంతానం. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జంగాల అజయ్ కుమార్, జిల్లా కార్యదర్శి కోట మాల్యాద్రి, జిల్లా సహాయ కార్యదర్శి మేడా హనుమంతరావు, ప్రజా నాట్య మండలి నగర అధ్యక్షులు మహేంద్ర వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.

సుంకర లక్ష్మీనారాయణకు సీపీఐ నేతల నివాళి

విశాలాంధ్ర-మంగళగిరి : పెదవడ్లపూడి గ్రామంలో సోమవారం సీపీఐ సీనియర్ నాయకులు సుంకర లక్ష్మీనారాయణ సంస్మరణ కార్యక్రమానికి హాజరైన సీపీఐ నాయకులు ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళు లర్పించారు. నివాళులర్పించిన వారిలో సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి చిన్ని తిరుపతయ్య, నియోజకవర్గ సహాయ కార్యదర్శులు యార్లగడ్డ వెంకటేశ్వరరావు, కంచర్ల కాశయ్య, మండల కార్యదర్శి జాలాది జాన్ బాబు, ముసునూరి సుహాస్, జవ్వాది సాంబశివరావు, సుంకర వెంకటనారాయణ, వెంకటేశ్వరరావు, కరీముల్లా, గ్రామ సీపీఐ నాయకులు, కార్యకర్తలు తదితరులు ఉన్నారు.

పారిశుధ్య కార్మికుల పెండింగ్ జీతాలు చెల్లించాలి: ఏఐటీయూసీ

విశాలాంధ్ర-ఈపూరు : రెండేళ్లుగా ఈపూరు గ్రామంలో పనిచేస్తున్న స్వచ్ఛ భారత్ గ్రీన్ అంబా సిడర్స్ కార్మికుల జీతాలు పెండింగ్‌లో ఉన్నాయని, వెంటనే చెల్లించాలని ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ఈపూరు ఎంపీడీవో కార్యాలయం ఎదుట సోమవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వినుకొండ ఏఐటీయూసీ నియోజకవర్గ కార్యదర్శి బూదాల శ్రీనివాసరావు మాట్లాడుతూ రెండేళ్లుగా జీతాలు లేకుండా కార్మికులతో వెట్టిచాకిరి చేయించడం దుర్మార్గం అన్నారు. స్వచ్ఛభారత్ కార్మికుల జీవన ప్రమాణాలను మెరుగుపరచేందుకు ప్రభుత్వం పలు స్కీములు ప్రవేశపెడుతున్నా, గ్రామ స్థాయిలో మాత్రం అధికారులు కార్మికుల కడుపులు కొట్టడం సిగ్గుచేటని మండిపడ్డారు. అలాగే కార్మికుల సమస్యలను పరిష్కరించేందుకు పంచాయతీ రాజ్ మంత్రి, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, స్థానిక ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు, పల్నాడు జిల్లా కలెక్టర్‌లకు వినతిపత్రాలు సమర్పించినప్పటికీ అధికారులు స్పందించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. 15వ ఆర్థిక సంఘం నిధుల ద్వారా జీతాలు విడుదల చేయాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు వచ్చినా, అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆయన విమర్శించారు. మండల ఏఐటీయూసీ నాయకుడు ఉట్ల రామారావు మాట్లాడుతూ జీతాలు రాకున్నా కార్మికులు పారిశుధ్య పనులు ఆపలేదు. అయినప్పటికీ వారికి జీతాలు ఇవ్వకపోవడం విచారకరం. ప్రభుత్వం తక్షణమే జోక్యం చేసుకొని పెండింగ్ జీతాలు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. పారిశుధ్య కార్మికులు తమ గ్రామాల పరిశుభ్రత కోసం కష్టపడుతూనే ఉన్నారు. కానీ ప్రభుత్వం వారిని పట్టించుకోకపోతే, ఉద్యమాన్ని మరింత ఉధృతం చేయాల్సి వస్తుందని ఏఐటీయూసీ నాయకులు హెచ్చరించారు. అనంతరం వినతిపత్రాన్ని ఈపూరు ఎంపీడీవోకి అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు కొప్పురపు మల్లికార్జున, పిన్నబోయిన వెంకటేశ్వర్లు, స్వచ్ఛభారత్ కార్మికులు పాల్గొన్నారు.

నాయి బ్రాహ్మణుల జీవోలను అమలు చేయలి: తాటికొండ

విశాలాంధ్ర-గుంటూరు సిటీ: నాయి బ్రాహ్మణ బార్బర్ షాపులకు రాష్ట్ర ప్రభుత్వము 200 యూనిట్లు ఉచిత విద్యుత్ ఇవ్వాలని జీవో 69 విడుదల చేసినప్పటికీ అధికారులు జీవోని అమలు చేయడంలో జాప్యం చేస్తున్నారని బార్బర్ షాప్ వారు కరెంటు ఎంత వాడుకున్నప్పటికీ అందులో 200 యూనిట్లు మినహాయించి మిగిలిన యూనిట్లకు బిల్లు ఇవ్వాలని ఏపీ నాయీబ్రాహ్మణ జేఏసీ రాష్ట్ర అధ్యక్షులు తాటికొండ నరసింహారావు కోరారు. ఈ మేరకు సోమవారం కలెక్టరేట్‌లో జరిగిన పీజీఆర్ఎస్ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియాకు వినతిపత్రం అందజేశారు. విశ్వ ఆయుర్వేదిక పితామహులు ధన్వంతరి జయంతి ఉత్సవాలను రాష్ట్ర ప్రభుత్వము అధికారికంగా నిర్వహించేందుకు జీవో విడుదల చేయాలని, జీవో నెంబర్ 5 ని అమలు చేయాలని కలెక్టర్‌ను కోరారు.

25, 26 తేదీల్లో తెలుగింటి సంప్రదాయ దుస్తుల పోటీలు

విశాలాంధ్ర-తెనాలి : శ్రీ వెంకటేశ్వర అన్నమాచార్య సంకీర్తన సేవ బృందం వారి ఆధ్వర్యంలో ఈ నెల 25, 26 తేదీలలో సాయంత్రం 6 గంటలకు శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని కళావేదికలో 10 సంవత్సరాల నుంచి 18 సంవత్సరాల లోపు ఆడపిల్లలకు సాంప్రదాయ దుస్తుల పోటీలు జరుపనున్నట్లు సంస్థ కన్వీనర్ కొండపి శ్రీనివాసరావు తెలిపారు. ఈ పోటీలు తెనాలి వాసులకు మాత్రమే వర్తించునని చెప్పారు. ఈ పోటీలలో విజేతలకు మొదటి బహుమతి ఒకరికి రూ.1000లు, రెండవ బహుమతి ఇద్దరికీ రూ.500లు, మూడవ బహుమతి ముగ్గురికి రూ.300లు, చిన్నపిల్లలకు 10 సంవత్సరాల నుంచి 13 సంవత్సరాల వారి వరకు ఐదుగురికి కన్సోలేషన్ బహుమతులు రూ.100లు చొప్పున అందజేయనున్నట్లు తెలిపారు. పోటీలో పాల్గొనదలచిన వారు ముందుగా పేరు, వయస్సు వాట్సాప్ నెంబర్ 9246440685 ద్వారా నమోదు చేసుకోవాలని సూచించారు. వివరాలకు సెల్-9948302907లో సంప్రదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో అందె బాలచంద్రమౌళి, కారంపూడి రమాదేవి, అక్కల ఆదిలక్ష్మి పాల్గొన్నారు.

వడ్డపల్లి ఎద్దు వాగు ఆక్రమణలు తొలగించాలి: సీపీఐ

విశాలాంధ్ర-సత్తెనపల్లి రూరల్ : పట్టణంలోని వడ్డవల్లి శివారు శాలివాహన నగర్, సుందరయ్య కాలనీ, నాగన్న కుంట, వెంకటపతి కాలనీ ప్రక్కగా వెళ్లే ఎద్దు వాగు ఆక్రమణకు గురైందని దీనితో సత్తెనపల్లిలోని వివిధ కాలనీలు ఎద్దు వాగు ఉధృతితో ముంపుకు గురవుతున్నాయని సీపీఐ సత్తెనపల్లి పట్టణ కార్యదర్శి వల్లెం లక్ష్మీచెన్నకేశవరావు ఆవేదన వ్యక్తం చేశారు. సంబంధిత ప్రభుత్వ అధికారులు వెంటనే స్పందించి ఎద్దు వాగు ఆక్రమణలను తొలగించి వాగు పూడికను తీయించాలని కోరారు. లేనిపక్షంలో ముంపుకు గురవుతున్న కాలనీ బాధితులతో కలిసి పోరాటం చేస్తామని తెలియజేశారు.

ముగ్గురికి సాఫ్ట్‌వేర్ ఉద్యోగాలు

విశాలాంధ్ర-మాచర్ల : మండలంలోని అలుగురాజుపల్లె నూటన్స్ ఇంజనీరింగ్ కళాశాలలో జరిగిన క్యాంపస్ ప్లేస్మెంట్‌లో ఆ కళాశాలకు చెందిన ముగ్గురు విద్యార్థులు సాఫ్ట్వేర్ ఉద్యోగాలకు సెలెక్ట్ అయినట్లు కళాశాల కరస్పాండెంట్ జున్నా శ్రీనివాసరెడ్డి తెలిపారు. జున్నా శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ క్వాలిఫైడ్ అధ్యాపకులచే తమ కళాశాలలో క్రమశిక్షణతో కూడిన విద్యనందించడం జరుగుతుందన్నారు. ఇప్పటికే తమ కళాశాల విద్యార్థులు క్యాంపస్ ప్లేస్మెంట్‌లలో ఎన్నో ఉద్యోగాలు సాధించినట్లు తెలిపారు. తాజాగా సోమవారం హైదరాబాదుకు చెందిన జన్‌ట్రీ ల్యాబ్స్ ప్రైవేట్ లిమిటెడ్ సాఫ్ట్వేర్ కంపెనీ ప్రతినిధులు నిర్వహించిన క్యాంపస్ ప్లేస్మెంట్‌లో సిఎస్‌సికి చెందిన ముగ్గురు విద్యార్థులు సెలెక్ట్ అయినట్లు ఆయన తెలిపారు. సందర్భంగా విద్యార్థులను ఆయన అభినందించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ డాక్టర్ జి.జగదీశ్వర్ రెడ్డి, వైస్ ప్రిన్సిపల్ బి.నరసింహారావు, టిపిఓ రామ్మోహన్ రెడ్డి హెచ్ఓడీస్ ఉన్నారు.

ఉత్కంఠభరితంగా చెస్ ఛాంపియన్‌షిప్

విశాలాంధ్ర-గుంటూరు కలెక్టరేట్ : ఆంధ్రప్రదేశ్ చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గుంటూరు జిల్లా చేబ్రోల్ మండలం వడ్లమూడి విజ్ఞాన్ యూనివర్సిటీలో జరుగుతున్న 62వ జాతీయ చెస్ ఛాంపియన్‌షిప్-2025 పోటీలు ఉత్కంఠభరితంగా జరుగుతున్నాయి. తొలి రౌండ్‌లో ఎక్కువ మంది గ్రాండ్‌మాస్టర్లు, ఇంటర్నేషనల్ మాస్టర్లు సునాయాస విజయాలతో రెండో రౌండ్‌కి చేరుకున్నారు. రెండో సీడ్ సూర్యశేఖర్ గంగూలీ మొదటిరోజు సుదీర్ఘమైన గేమ్‌ను ఆడి చివరికి తనదైన స్టైల్‌లో విజయం సాధించారు. జీఎం ఇనియాన్ (తమిళనాడు)-రిషిత్ శర్మ(గుజరాత్)పై క్లినికల్ విజయంతో బలమైన ఆరంభం చేశారు. జీఎం సూర్య శేఖర్ గంగూలీ(పీఎస్‌పీబీ)-తెలంగాణాకు చెందిన తిజిల్ సింగ్‌పై అనుభవజ్ఞతతో పూర్తి పాయింట్లు సాధించారు. జీఎం సేతురామన్ (పీఎస్‌పీబీ)-మహారాష్ట్ర ప్లేయర్ సంస్కృతి వాంఖడేపై ధీటైన విజయాన్ని సాధించారు. జీఎం క్రిష్ణన్ శశికిరణ్ (పీఎస్‌పీబీ)-క్రమబద్ధమైన ఆటతో ప్రత్యర్థి మజీపై (కేబఐటీ) గెలిచారు. జీఎం ఎన్ఆర్ విగ్నేష్ (ఆర్ఎస్‌పీబీ)-సులభంగా విజయం నమోదు చేసుకున్నారు. మొదటి రోజునే కొన్ని సంచలన ఫలితాలు నమోదు కావడం టోర్నమెంట్ వాతావరణాన్ని మరింత ఉత్కంఠభరితంగా మార్చింది. తమిళనాడుకు చెందిన ఎన్.ఆర్ల ప్రకాష్, గ్రాండ్‌మాస్టర్ ప్రణీత్ వుప్పల(తెలంగాణ)ను డ్రాగా నిలిపారు. ఢిల్లీలోని అమర్త్య సౌమిత్ర గుప్తా, తమిళనాడు ఐఎం హర్ష్న సురేష్‌ను నిలువరించారు. రైల్వే జట్టుకు చెందిన గ్రాండ్‌మాస్టర్ దీపన్ చక్రవర్తి, ఐఎం సిద్ధాంత్ మోహపాత్రా తమతమ ప్రత్యర్థులతో పాయింట్లు పంచుకోవాల్సి వచ్చింది. పీఎస్‌పీబీకి చెందిన ఐఎం నిషా మొహోటా, తెలంగాణ ఆటగాడు మోక్షిత్ పసిపులేటి చేతిలో ఓటమి పాలయ్యారు. అలాగే ఆంధ్రప్రదేశ్ అభిమాన ఆటగాడు, 2017 జాతీయ ఛాంపియన్ లలిత్ బాబు, ఛత్తీస్‌గఢ్‌కు చెందిన గగన్ సహూను చాకచక్యంగా ఓడించారు. ప్రముఖ గ్రాండ్‌మాస్టర్లు బలంగా ఆరంభించినా, యువ ప్రతిభావంతుల సంచలన ప్రదర్శనలు రాబోయే రోజుల్లో టోర్నమెంట్ మరింత రసవత్తరంగా మారనుందని సూచిస్తున్నాయని టోర్నమెంట్ డైరెక్టర్, ఆంధ్ర చెస్ అసోసియేషన్ సెక్రటరీ కె.జగదీష్ తెలియజేశారు.

విద్యార్థులకు ఇండక్షన్ ప్రోగ్రాం పై అవగాహన

విశాలాంధ్ర - బంటుమిల్లి : స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సోమవారం ఎస్.ఐ.పి స్టూడెంట్ ఇండక్షన్ ప్రోగ్రాం ఘనంగా జరిగింది .ఈ సందర్భంగ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య .డాక్టర్. ఎస్ జగన్ మోహనరావు మాట్లాడుతూ విద్యార్థుల్లో భయం పోయి ధైర్యం వహించి అందరూ కలిసి మెలిసి ,సమత మమతలతో ఒక్క కుటుంబంగా మెల గాలని, ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యాకుటుంబం ముందుకాలంలో మరెన్నో మైలురాళ్ళు అధిగమించాలని, మనసారా కోరుకుంటున్నట్లు హర్షం వ్యక్తం చేశారు. ప్రతి విద్యార్థి కూడా ఒక లక్ష్యాన్ని ఏర్పాటు చేసుకొని ముందుకు వెళుతూ కళాశాలకు, తల్లిదండ్రులకు మంచి పేరు తేవలసిందిగా ఆకాంక్షిం చారు. ఈ ఇండక్షన్ ప్రోగ్రాంలో వైస్ ప్రిన్సిపాల్ దేవ జయరాజు,ఐక్యూఏసి కోఆర్డినేటర్ ఆర్.హిమాలినీ దేవి,ఎన్.ఎస్.ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ జి.బి.ఆనంద కుమార్,జ్యోత్స్న, చలం ప్రసాద్, రామారావు, రత్న మొదలైన అధ్యాపకులతో పాటు విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు.ఆంధ్రప్రదేశ్ ప్రభు త్వం నిర్దేశించిన ఈ కార్యక్రమాన్ని చాలా చక్కగా నిర్వహించటం సంతో షంగా ఉందంటూ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య డాక్టర్. జగన్మోహనరావు వ్యక్తం చేశారు.

ఘనంగా వావిలాల గోపాలకృష్ణయ్య జయంతి వేడుకలు

విశాలాంధ్ర - గుడివాడ : తెలుగు భాష వికాస సమితి ఆధ్వర్యంలో సోమవారం స్థానిక ఆంజనేయ పేటలోని కామ్రేడ్ సుందరయ్య భవనంలో వావిలాల గోపాలకృష్ణయ్య జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్య క్రమానికి ముఖ్యఅతిథిగా పెదపారుపూడి మండలం డిప్యూటీ ఎండిఓ వంగా శ్రీనివాస్ విశిష్ట అతిథిగా సిపిఎం నాయకులు ఆర్.సి.పి రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శాసన సభ్యుడుగా ప్రజా సమస్యల పరిష్కారానికి అహో రాత్రులు శ్రమించిన నిజమైన ప్రజా నేత వావిలాల గోపాలకృష్ణయ్యన్నారు. ప్రజా సమస్యలే కాకుండా తెలుగు భాషాభివృద్ధికి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం అధికార భాషా సంఘం తొలి చైర్మెన్‌గా ఆయన చేసిన సేవలు శ్లాఘనీయమన్నారు. ఈ సంద ర్భంగా తెలుగు ఉత్తమ ఉపాధ్యాయుడు కాపూరి శ్రీధర్‌కు వావిలాల గోపాలకృష్ణయ్య స్ఫూర్తి సాహితీ పురస్కారం 2025ను అతిథుల చేతుల మీదుగా అందచేశారు. తొలుత వావి లాల చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో తెలుగు భాషా వికాస సమితి సమన్వ యకర్త డి.ఆర్.బి ప్రసాద్ సభ్యులు అభిరేనేని వెంకటేశ్వరరావు, చోడవరపు రూపా, లంకా సురేంద్ర, పివిఎన్‌వి రాజకు మారి, పావులూరి శ్రీనివాసరావు, నవభారత్ ఖాదీ స్టోర్స్ అధినేత సయ్యద్ గఫార్, ఎన్జీవో జిల్లా నాయకులు ఫరీద్ భాష, బిజెపి పట్టణాధ్య క్షుడు మాచర్ల రామ కృష్ణ(ఆర్‌కె), కుచిభోట్ల సుబ్ర హ్మణ్యం,కాపూరి మానస. తదితరులు పాల్గొన్నారు.

విమానాశ్రయ నిర్వాసితుల సమస్యలను పరిష్కరించాలి : యార్లగడ్డ

విశాలాంధ్ర - గన్నవరం : గన్నవరం విమానాశ్రయ విస్తరణ నిర్వాసితుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని ప్రభుత్వ విప్ గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు అసెంబ్లీలో కోరారు. శాసన సభ వర్షా కాల సమావేశంలో భాగంగా సోమవారం అసెంబ్లీలో మాట్లా డిన యార్లగడ్డ విమానాశ్రయ విస్త రణ కోసం 2015 వ సంవత్సరం గన్నవరం మండలంలోని దావాజీగూడెం, బుద్ధవరం, అల్లాపురం, అజ్జంపూడి గ్రామాల్లో 835 ఎకరాల భూమిని సేకరించారని భూములు ఇచ్చిన రైతుల సమ స్యలు ఇంకా పరిష్కారానికి నోచుకోలేద న్నారు. రైతుల సమస్యలను తక్షణమే పరిష్కరిం చాలని విన్నవించారు. విమానా శ్రయ విస్తరణలో 423 మంది ఇళ్ళు కోల్పోగా వారిలో 300 మంది పేద ఎస్సీలు ఉన్నారని తెలిపారు. ఇల్లు కోల్పోయిన నిర్వాసితులకు పునరా వాసం కోసం ఆర్అండ్ ఆర్ ప్యాకేజీ ద్వారా ఒక్కొక్కరికి ఐదు సెంట్లు భూమిలో ఇళ్ళు నిర్మించి ఇచ్చేం దుకు కాలనీ ఏర్పాటు చేశా రని ఈ కాలనీలో కనీస వసతులు లేవని, ఇక్కడ మౌలిక వసతుల కల్ప నకు రూ.80 కోట్లు కేటాయించాలని కోరారు. అదే విధం గా ఇళ్ళు కోల్పోయిన నిర్వాసితులకు ఒక్కొక్కరికి తొమ్మిది లక్షల పరిహారంగా ఇవ్వాల్సి ఉందని ఇందు నిమిత్తం రూ.59 కోట్లు కేటా యించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. దావాజీ గూడెంలో మైక్రో కాల్వ నిర్మా ణం కోసం 45 ఇళ్ళు తొలగించారని నిర్వాసితులకు వారికి రూ.50 వేలు చొప్పున అద్దె ఇవ్వాల్సి ఉంద న్నారు. విమానాశ్రయానికి భూములు ఇచ్చిన రైతులకు రూ.27 కోట్లు కౌలు బకాయిలు విడుదల చేయాలని యార్లగడ్డ కోరారు. రూ.459 కోట్లతో చేపట్టిన విమా నాశ్రయ టెర్మినల్ భవన నిర్మాణం వేగవంతం చేయాల న్నారు. విమానా శ్రయ విస్తరణ కోసం సీతారామచంద్ర స్వామి ఆలయం, వల్లి దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయాల భూములు 4.30 ఎకరాలు సేకరిం చారని ఆ భూములకు రాజధానిలో భూముల కేటా యించాలని అసెంబ్లీ లో యార్లగడ్డ కోరారు.

రూమియన్ వేరియంట్లలో ఆరు ఎయిర్‌బ్యాగ్‌లతో టీకేఎం టయోటా కిర్లోస్కర్ మోటార్

విశాలాంధ్ర - గుంటూరు : టయోటా కిర్లోస్కర్ మోటార్ (టీకేఎం) తన ప్రశంసలు పొందిన ఫ్యామిలీ మూవర్ టయోటా రూమియన్‌కు కీలకమైన అప్‌గ్రేడ్‌ను ప్రకటించింది. మెరుగుపరచబడిన భద్రత: వివిధ వేరియంట్లలో 6 ఎయిర్ బ్యాగులు అందుబాటులోకి తీసుకువచ్చింది. ప్రయాణికుల భద్రతను మరింతగా బలోపేతం చేసే దిశగా టయోటా కిర్లోస్కర్ మోటార్ ప్రతి రూమియన్ వేరియంట్‌లో ఆరు ఎయిర్‌బ్యాగ్‌లను (ఫ్రంట్, సైడ్ మరియు కర్టెన్ షీల్డ్) ప్రామాణికంగా అందుబాటులోకి తెచ్చింది. ఈ అప్‌గ్రేడ్‌తో, అన్ని మోడళ్లు డ్యూయల్ ఫ్రంట్ ఎయిర్‌బ్యాగ్‌లు, రెండు సైడ్ ఎయిర్‌బ్యాగ్‌లు మరియు రెండు కర్టెన్ షీల్డ్ ఎయిర్‌బ్యాగ్‌ల సమన్వయంతో 360 డిగ్రీల సమగ్ర భద్రతను అందిస్తాయి. ఈ ఆధునిక రక్షణ వ్యవస్థ వివిధ డ్రైవింగ్ పరిస్థితుల్లో డ్రైవర్‌తో పాటు ప్రయాణికులకు గరిష్ట భద్రతను నిర్ధారిస్తుంది.

అదనపు హోమ్ టాప్ గ్రేడ్‌లో టీపీఎంఎస్

టయోటా, రూమియన్ టాప్‌వీ గ్రేడ్‌లో ఆధునిక టైర్ ప్రెజర్ మాని టరింగ్ సిస్టమ్‌ను ప్రవేశపెట్టింది. ఈ సాంకేతిక పరిజ్ఞానం టైర్ ఒత్తిడిని నిరంతరం పర్యవేక్షించడంతో పాటు, మెరుగైన భద్రత, అధిక ఇంధన సామర్థ్యం మరియు డ్రైవింగ్ సౌలభ్యాన్ని అందిస్తుంది. ఈ నూతన ఫీచర్‌తో, రూమియన్ భారతీయ కుటుంబాలకు సాంకేతికంగా ఆధునిక ఎంపీవీ గా తన స్థానాన్ని మరింత బలోపేతం చేస్తుంది.

శ్రీబాలత్రిపుర దేవిగా అమ్మవారి అవతారం

ఘనంగా ప్రారంభమైన దసరా ఉత్సవాలు

విశాలాంధ్ర - ఘంటసాల : ఘంటసాల సత్రవు సెంటర్లోని శ్రీ రామాలయంలో దసరా ఉత్సవాలు సోమవారం ఘనంగా ప్రారంభమై య్యాయి. ఆస్ట్రేలియాకు చెందిన ఆదిరాల సుమన్ - చైతన్య దంపతులు అమ్మవారి విగ్రహం అందించగా అర్చకులు ఆర్వివిస్ సుధాకర్ శర్మ ఆధ్వర్యంలో అమ్మా వారికి విగ్నేశ్వర పూజ, కలశ పూజ, అమ్మవారి సహస్ర నామ పూజ చేశారు. మొదటి రోజు అమ్మవారు శ్రీ బాల త్రిపురా దేవి అవతారంలో భక్తులులకు దర్శనమిచ్చారు ఆలయ కమిటీ ప్రెసిడెంట్ ఆదిరాల దుర్గా భవాని, పోతార్లంక శ్రీనివాసరావు, పోతార్లంక వెంకటేశ్వ రావు, ఆదిరాల రాముడు, సత్యనారాయణ, ప్రసాద్, భవాని, భక్తులు పాల్గొన్నారు.

వాసవీమాతకు పల్లకీసేవ, నగర సంకీర్తన

విశాలాంధ్ర - చల్లపల్లి : చల్లపల్లిలోని శ్రీకన్యకా పరమేశ్వరీ అమ్మవారి ఆల యంలో శ్రీదేవీ శరన్నవ రాత్రి మహోత్సవాలు ఘనంగా ప్రారంభమ య్యాయి. కళ్యాణమండపం అధ్యక్షుడు కొల్లిపర నాగ పోతురాజు(మధు) జెండాప్రతిష్టచేశారు. ఆలయ అర్చకులు మామిళ్లపల్లి శివరామకృష్ణ, పురోహితులు లంకా చక్రపాణిలు పూజా కార్యక్రమాలు నిర్వహించారు. సుప్రభాతసేవ, ప్రత్యేక పూజలు, విశేష హోమమ ఎలు జరిపారు. శ్రీవాసవీ భక్తబృందం వారిచే గీతాపారాయణం, శ్రీలలిత విష్ణు సహస్రనామ పారాయణ చేశారు. శ్రీఆర్యవైశ్య యువజన సంఘం ఆధ్వర్యంలో ఉదయం నగర సంకీర్తన, పల్లకీసేవలు నిర్వహించారు. పొట్టిశ్రీ రాములు వీధిలోని శ్రీఆర్యవైశ్య సంఘ భవనం నుంచి బయలుదేరి తీన్మార్ డప్పులతో పెదకళ్లేపల్లి రోడ్డులోని అమ్మవారి ఆలయం వరకు శ్రీవాసవీమాత పల్లకీసేవ జరిగింది. ఈ కార్యక్రమంలో సంఘ ప్రతినిధులు అన్నవరపు పాండురంగారావు, తమ్మన సతీష్కుమార్ వరదా రాజశేఖర్, కొల్లిపర నరేంద్ర తదితరులు పాల్గొన్నారు.

వాసవీక్లబ్ ఆధ్వర్యంలో పాతదుస్తుల సేకరణ

విశాలాంధ్ర - చల్లపల్లి : ఇంటిలో ఉపయోగించని పాత దుస్తులను సేకరించి నిరుపేదలకు పంపిణీ చేసేలా చల్లపల్లి వాసవీక్లబ్ ఆధ్వర్యంలో వాసవి హెల్పింగ్ హ్యాండ్స్ అనే కార్యక్రమ 0 సోమవారం ప్రారంభించారు. రామలింగయ్య పాఠశాల పక్కన వాసవీక్లబ్ కార్యాలయంలో ప్రతి రోజూ దుస్తుల సేకరణ చేసి వాటిని గ్రేడింగ్ చేసి రోడ్డువెంబడి నివసించే సంచారజాతులు, నిరుపేదలకు అందించనున్నారు. చల్లపల్లి పరిసర గ్రామాల్లోని వారెవరైనా ఇంటిలో వాడకుండా నిరుపయోగంగా ఉన్న చీరలు, డ్రస్సు, ప్యాంటు, షర్టులు తదితర దుస్తులను చల్లపల్లి వాసవీక్లబ్ కార్యాలయంలో అందించి పేదవారికి సహాయపడేలా తాము చేపట్టిన ఈ కార్యక్రమానికి సహకారం అందించాల్సిందిగా వాసవీక్లబ్ నేతలు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో క్లబ్ అధ్యక్ష కార్యదర్శులు మాజేటి అమరవాణి, గోళ్ల వెంకటరత్నం, గోళ్ల ద్రోణపూర్ణచంద్రరావు, విజయ్యుష్ణదీపిక, పురిమి రమేష్, వరదా రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ద్విచక్ర వాహనాలపై ప్రత్యేక ధర, అమ్మకాలతో ఫ్లిప్‌కార్ట్ ది బిగ్ బిలియన్ డేస్

విశాలాంధ్ర - విజయవాడ: భారతదేశపు స్వదేశీ ఇ కామర్స్ మార్కెట్ ప్లేస్ అయిన ఫ్లిప్‌కార్ట్, తమ వార్షిక షాపింగ్ ఫెస్టివల్, ది బిగ్ బిలియన్ డేస్ కోసం సిద్ధమవుతున్న వేళ, పెట్రోల్ మరియు ఎలక్ట్రిక్ వాహనాలలో విస్తృత ఎంపిక అవకా శాలను అందించటం ద్వారా భారతదేశం ద్విచక్ర వాహనాల కోసం షాపింగ్ చేసే విధానాన్ని మార్చ డానికి సిద్ధంగా ఉందని ఫ్లిప్‌కార్ట్ ఎలక్ట్రానిక్స్ విభాగ ప్రతినిధి సుజిత్ ఆగాషే తెలిపారు. పండుగ సీజన్ ప్రారంభం కావడంతో, వైవిధ్యం, స్థోమత, నమ్మకం, 24 గంటలూ కస్టమర్ మద్దతు కల యికను అందించడం ద్వారా ద్విచక్ర వాహనాలకు ఇష్టమైన గమ్యస్థానంగా తన స్థానాన్ని ఫ్లిప్‌కార్ట్ బలోపేతం చేస్తోందన్నారు. ఈ ప్లాట్‌ఫామ్ లో కమ్యూటర్లు, పనితీరు, ప్రీమి యం బైక్‌ల నుండి అత్యధికంగా అమ్ముడవుతున్న స్కూటర్లు, ఎలక్ట్రిక్ ద్విచక్ర వాహనాల విస్తృత పోర్ట్‌ఫోలియో వుంది. వీటిలో హీరో, టీవీఎస్, బజాజ్, సుజుకి, టీవీఎస్ ఐక్యూబ్, చేతక్, ఏథర్, వీడా, ఓలాఉ ఆంపియర్ వంటి అనేక ప్రముఖ బ్రాండ్‌లు ఉన్నాయన్నారు. బిగ్ బిలియన్ డేస్ 2025లో జావా యెజ్డి, కెటిఎమ్ ఒ ట్రయంఫ్‌లతో పాటు విభిన్న ప్రీమియం మోటార్‌సైకిల్ ఎంపిక అవకా శాలను అందించడంతో పాటుగా రాయల్ ఎన్‌ఫీల్డ్ మోటార్‌సైకిల్స్ విడుదలలు కూడా జరుగ నున్నా యని చెప్పారు. సెప్టెంబర్ 22 నుంచి అమ ల్లోకి రానున్న జీఎస్టీ రేటు సవరణ లో భాగంగా 350 సీసీ కంటే తక్కువ ఉన్న ద్విచక్ర వాహనాలపై పన్నును 28 శాతం నుండి 18 శాతం కి తగ్గిం చడంతో, కస్టమర్‌లు ఇప్పుడు తమ కొనుగోళ్లపై విలువను పెంచుకునే అవకాశం ఉందన్నారు. సరైన సమయంలో చేసిన ఈ విధాన మార్పు ఫ్లిప్‌కార్ట్ పండుగ డీల్స్ , ఫైనాన్సింగ్ ఎంపికలతో సమలేఖనం చేయబడిందని తెలిపారు. ఎక్కువ మంది కస్టమర్‌లు కొనుగోళ్ల కోసం ఆన్‌లైన్ ప్లాట్ ఫామ్‌ల వైపు మొగ్గు చూపుతున్నందున, ఫ్లిప్‌కార్ట్ ఈ మార్పును డిజిటల్‌గా ప్రారంభించబడిన , పారదర్శకతతో యాక్సెసిబిలిటీ , సౌలభ్యానికి ప్రాధాన్యత ఇస్తుందన్నారు. సమగ్రమైన ఆన్ రోడ్ ధర నిర్ణయం, డిజిటల్ బీమా మరియు ఫైనాన్సింగ్ ఎంపికలతో, ఫ్లిప్‌కార్ట్ కస్టమర్లు తగిన సమా చారంతో కూడిన కొనుగోలు నిర్ణయం తీసుకునేలా అధికారం కల్పిస్తోందని చెప్పారు.

ఇన్‌స్టామార్ట్ క్విక్ ఇండియా మూవ్‌మెంట్ 2025 ప్రారంభం

విశాలాంధ్ర - గుంటూరు : భారతదేశపు వేగవంతమైన సేల్, ఇన్‌స్టామార్ట్ క్విక్ ఇండియా మూవ్‌మెంట్ 2025 ఇప్పుడు స్విగ్గీ, ఇన్‌స్టామార్ట్ యాప్‌లలో ప్రత్యక్ష ప్రసారం చేయబడుతోంది. నెల 19 నుంచి 28 వరకు, వినియోగదారులకు 10 రోజుల పాటు 50-90 శాతం వరకు అద్భుతమైన ఆదాలను, మెరుపు వేగంతో డెలివరీని, పండుగ ఉత్సాహాన్ని అందిస్తోంది. వినియోగదారులు వివిధ కేటగిరీల్లో భారీ డిస్కౌంట్లు, హాటెస్ట్ లాంచ్‌లు, అగ్రశ్రేణి బ్రాండ్‌ల నుండి పండుగ డీల్స్‌ను ఆశించవచ్చు. అన్నీ 10 నిమిషాల్లో డెలివరీ చేయబడతాయి. 50 వేలకు పైగా ఉత్పత్తులను ఆఫర్ చేస్తూ, ఇన్‌స్టామార్ట్ ఈ సీజన్‌లోని అతిపెద్ద ఆఫర్‌లకు క్విక్ కామర్స్ వేగం, సౌలభ్యాన్ని తీసుకురావడం ద్వారా పండుగ షాపింగ్‌ను పునర్నిర్వచిస్తోంది. పెద్ద గాడ్జెట్‌ల నుండి పండుగకు సిద్ధంగా ఉండే నిత్యావసరాల వరకు, క్విక్ఇండియా మూవ్‌మెంట్ సేల్‌లో ఆపిల్, వన్‌ప్లస్, జెబిఎల్, మార్షల్, లోరియల్ ప్యారిస్, డి'డెకార్, బార్బీ, లెగో, డోవ్ వంటి బ్రాండ్‌లు ఉంటాయి.

ఖుషియా అన్‌లిమిటెడ్ ప్రచారంతో ఎస్‌బిఐ కార్డ్ పండుగ ఆఫర్ 2025 విడుదల

విశాలాంధ్ర - విజయవాడ (వన్‌టౌన్) : భారతదేశపు అతిపెద్ద ప్యూర్-ప్లే క్రెడిట్ కార్డ్ జారీదారు, ఎస్‌బిఐ కార్డ్, 'ఖుషియా అన్?లిమిటెడ్' ప్రచారంతో పండుగ సీజన్ 2025 కోసం దేశవ్యాప్తంగా విస్తృతమైన ఆఫర్ల అందిస్తోంది. వినియోగదారులు టైర్ 2, టైర్ 3 నగరాలలో సహా 2900 పైగా నగరాలలో ఆన్లైన్, ఆఫ్లైన్ ప్లాట్ఫార్మ్ పై 1250 పైగా వ్యాపారులచే నిధులు అందించబడే ఆఫర్లు, క్యాష్‌బ్యాక్, తక్షణ డిస్కౌంట్ ఆఫర్ల నుండి ప్రయోజ నం పొందవచ్చు. ఈ పండుగ ఆఫర్లు కన్సూమర్ డ్యూరబుల్స్, మొబైల్స్, ల్యాప్‌టాప్స్, ఫ్యాషన్, ఫర్నీచర్, జువెల్లరీ, ఈ-కామర్స్, సరుకులతో కలుపుకొని అన్ని కీలక విభాగలపై వర్తిస్తాయి. పండుగ సంబరాలకు ఉత్సా హాన్ని అందించుటకు, ఎస్‌బిఐ కార్డ్, అమెజాన్, రిలయెన్స్ రీటెయిల్ గ్రూప్, మ్యాక్స్, రేమండ్స్, మాంటె కార్లో వంటి ప్రముఖ భాగస్వామ్య బ్రాండ్స్ లో కొనుగోళ్ళపై అద్భుతమైన డిస్కౌంట్లను అందిస్తోంది.

సెంటిని ఆధ్వర్యంలో విద్యార్థులకు స్పోర్ట్స్ డ్రెస్ అందజేత

విశాలాంధ్ర - కంచికచర్ల : గండేపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో హెచ్.ఎం సి.హెచ్ రామకృష్ణ , ఫిజికల్ డైరెక్టర్ జి.రాజేంద్రప్రసాద్ ప్రోద్ బలంతో సెంటిని వారి సౌజన్యంతో విద్యార్థిని, విద్యార్థులకు 18 జతల స్పోర్ట్స్ డ్రస్సును (సెంట్ ని ఏజీఎం. హెచ్ ఆర్). ఎం.శ్రీనివాసరావు, (సెంటిని మేనేజర్. హెచ్ఆర్) సిహెచ్. అమరేంద్రనాథ్ చేతుల మీదగా విద్యార్థినీ, విద్యార్థులకు ప్రధానం చేయడం జరిగింది.వారు ఈ పాఠశాలకు ఇంతకుముందు అనేక సేవకార్యక్రమాలు చేసియున్నారు. ఈ కార్యక్రమానికి పాఠశాల ప్రధానోపాధ్యాయులు సి.హెచ్ రామకృష్ణ, పాఠశాల చైర్మన్ బి కాటయ్య. ఉపాధ్యాయుని, ఉపాధ్యాయులు, విద్యార్థినీ, విద్యార్థులు మరియు గ్రామస్తులు పాల్గొని హర్షం వ్యక్తం చేశారు.

మహిళలకు సోలార్ పీవీ శిక్షణ

విశాలాంధ్ర-మంగళగిరి : వాసవ్య మహిళా మండలి విజయవాడ ఆధ్వర్యంలో ఆస్ట్రేలియన్ కాన్సులేట్ సహకారంతో మంగళగిరి ఆత్మకూరు నిర్మల ఫార్మసీ కాలేజీ ప్రాంగణంలో 14 రోజుల సోలార్ పీవీ టెక్నీషియన్ శిక్షణ కొన సాగుతోంది. సెప్టెంబర్ 10న ప్రారంభమైన ఈ శిక్షణ నేటితో 12వ రోజుకు చేరుకుంది.ప్రధాన అతిథి ఎన్ఎస్ఐసి జోనల్ జనరల్ మేనేజర్ వి.సురేష్ బాబు మాట్లాడుతూ మహిళలకు సోలార్ టెక్నాలజీ భవిష్యత్ ఉపాధికి దారి చూపుతుందని అన్నారు. వాసవ్య మహిళా మండలి ప్రెసిడెంట్ డాక్టర్ బొల్లినేని కీర్తి మహిళలను ప్రోత్సహించారు. వి.రవిబాబు చేతుల మీదుగా 32 మంది శిక్షణార్థులకు టూల్ కిట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో హైదరాబాద్ మేనేజర్ ముత్తు కుమారన్, ట్రైనర్ రాబిన్ జేమ్స్, నిర్మల ఫార్మసీ కాలేజీ సెక్రటరీ అండ్ కరెస్పాండెంట్ రెవరెండ్ సిస్టర్ జి.నిర్మల జ్యోతి, ప్రిన్సిపాల్ డాక్టర్ బి.పాముల రెడ్డి, ఉమెన్ సెల్ కోఆర్డినేటర్ రత్న మంజుల, వాసవ్య మహిళా మండలి సిబ్బంది పాల్గొన్నారు.

ఎలిస్టా తయారీ కర్మాగారాన్ని ప్రారంభించిన మంత్రి లోకేష్

విశాలాంధ్ర - విజయవాడ (వన్‌టౌన్) : టెక్నో డోమ్ గ్రూప్ కింద భారతదేశంలో అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న వినియోగదారు ఎలక్ట్రానిక్స్ బ్రాండ్లలో ఒకటైన ఎలిస్టా కొత్త అత్యాధునిక తయారీ ప్లాంట్‌ను రాష్ట్ర పరిశ్రమల మంత్రి నారా లోకేష్ ప్రారంభించారు. ఈ ప్లాంట్ కడపలోని ఈ ప్లాంట్ రూ. 250 కోట్ల దశలవారీ పెట్టుబడితో నిర్మించబడింది. ఇది భారతదేశ ఎలక్ట్రానిక్స్ తయారీలో ఒక ముఖ్యమైన మైలురాయిని సూచిస్తుంది. ఈ ప్లాంట్ 1.32 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో విస్తరించి ఉంది. దాని మొదటి దశలో ఇది సంవత్సరానికి ఒక మిలియన్ స్మార్ట్ టీవీలు, 1మిలియన్ ఎల్ఈడీ మానిటర్లను తయారు చేయగల సామర్థ్యాన్ని కలిగి ఉంది. 2వ దశలో, ఎలిస్టా వాషింగ్ మెషీన్లు, డిష్ వాషర్లు, స్మార్ట్ ఉపకరణాల తయారీతో కార్యకలాపాలను విస్తరించాలని యోచిస్తోంది. ఈ ప్లాంట్ దాదాపు 500 మందికి ఉపాధి కల్పిస్తుంది. ఈ సందర్భంగా పరిశ్రమల మంత్రి నారా లోకేష్ మాట్లాడుతూ, "ఎలిస్టా కొత్త ప్లాంట్ సహాయంతో కడప ప్రపంచ స్థాయి ఎలక్ట్రానిక్స్ తయారీ కేంద్రంగా మారుతుంది. ఇది 'మేక్ ఇన్ ఇండియా'కు మద్దతు ఇస్తుంది. ఆంధ్రప్రదేశ్‌లో పారిశ్రామిక వృద్ధి కోసం మా దార్శనికతకు ఇది అనుగుణంగా ఉంది. మన యువతకు ఉద్యోగాలను సృష్టిస్తుంది. ప్రపంచ పటంలో రాష్ట్ర స్థానాన్ని బలోపేతం చేస్తుంది" అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎలిస్టా చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ సాకేత్ గౌరవ్ తదితరులు పాల్గొన్నారు.

30 నాటికి ఓటరు జాబితా ఫిర్యాదులను పరిష్కరించాలి : కలెక్టర్

విశాలాంధ్ర - గుంటూరు సిటీ : స్పెషల్ రివిజన్ ద్వారా జిల్లాలోని బూత్ లెవల్ అధికారులందరూ 2002 ఓటరు జాబితా నుండి 2025 వరకు ఓటరు జాబితాను క్షుణ్ణంగా పరిశీలించి అందిన ఫిర్యాదులను ఈ నెల 30 నాటికి పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియా తెలిపారు. సోమవారం కలెక్టరేట్ లోని శంకరన్ మినీ సమావేశ మందిరంలో ఈఆర్ఓలు, ఏఈఆర్ఓలు, రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలెక్టర్ సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఓటరు జాబితాలు మరింత మెరుగ్గా రూపొందించేందుకు రాజకీయ పార్టీల ప్రతినిధులు సూచనలు అందించాలని కోరారు. రాజకీయ పార్టీల ప్రతినిధులు మాట్లాడుతూ ఆధార్ కార్డుకు ఓటరు కార్డు అనుసంధానం చేస్తే చాలా సమస్యలు పరిష్కారం అవుతాయని సూచించారు. ఆధార్ కార్డు అనుసంధానం వలన ఇతర రాష్ట్రల నుండి వలస వచ్చిన వారిని తొలగించే అవకాశం వుంటుందన్నారు. రాజకీయ పార్టీల ప్రతినిధులతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేయాలని కోరారు. సమావేశంలో డీఆర్వో ఖాజావలి, ఈఆర్వోలు, విపత్తుల నిర్వహణ శాఖ జిల్లా ప్రాజెక్టు మేనేజరు లక్ష్మీకుమారి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ గంగరాజు, ఆర్డీవో శ్రీనివాసరావు, పీడీ డీఆర్డీఏ విజయలక్ష్మీ , ఎలక్షన్ సెల్ సూపరింటెండెంట్ మల్లేశ్వరి పాల్గొన్నారు.

'పీజీఆర్ఎస్' నిర్వహణలో నిర్లక్ష్యం వద్దు :కలెక్టర్

విశాలాంధ్ర - గుంటూరు సిటీ : పిజిఆర్ఎస్ కార్యక్రమం నిర్వహణలో అధికారులు ఎటువంటి నిర్లక్ష్యం వహించరాదని జిల్లా కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా అధికారులకు సూచించారు. సోమవారం కలక్టరేట్ లోని శంకరన్ సమావేశ మందిరంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో కలెక్టర్ తమీమ్ అన్సారియా, సంయుక్త కలెక్టర్ అశుతోష్ శ్రీవాత్సవ, డిఆర్ఓ ఖాజావలి, డిప్యూటీ కలెక్టర్లు లక్ష్మీ కుమారి, గంగరాజు, గుంటూరు ఆర్డిఓ శ్రీనివాస రావు, ఈడీ ఎస్సీ కార్పొరేషన్ శ్రీనివాస్ ప్రజల నుండి 291 ఫిర్యాదులను స్వీకరించారు. తదుపరి అధికారులతో కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి అర్జీని నాణ్యతగా పరిష్కరించాలన్నారు. పరిష్కరించిన అర్జీ తిరిగి రీ ఓపెన్ కాకుండా పరిష్కరించాలన్నారు. జిల్లాలో ప్రజల సంతృప్తి స్థాయిని పెంచేలా చర్యలు తీసుకోవాలన్నారు.

ఎలుకల నియంత్రణ కార్యక్రమంపై రూపొందించిన పోస్టర్లు ఆవిష్కరణ :

సామూహిక ఎలుకల నియంత్రణ కార్యక్రమంపై రూపొందించిన పోస్టర్లను, కరపత్రాలను, ప్రధాన మంత్రి ఆవాస్ యోజన-అర్బన్ 2.0 అంగీకార్ 2025 ప్రచార పోస్టర్‌ను కలెక్టర్ తమీమ్ అన్సారియా సంయుక్త కలెక్టర్ శ్రీవాత్సవతో కలసి సోమవారం ఆవిష్కరించారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని వరి సాగు చేసే గ్రామాలలోని రైతు సేవా కేంద్రాల ద్వారా సామూహిక ఎలుకల నియంత్రణ కార్యక్రమము ఖరీఫ్ 2025 నిర్వహించబడుతుందన్నారు.

మెగా జాబ్‌మేళాకు విశేష స్పందన

విశాలాంధ్ర - మంగళగిరి : పట్టణంలో ఐటీ, విద్య శాఖల మంత్రి నారా లోకేష్ ఆదేశాలతో ఏపీ నైపు ణ్యాభి వృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన మెగా జాబ్ మేళాకు విశేష స్పందన లభించింది. మంగళగిరి నియో జకవర్గ వ్యాప్తంగా పెద్దఎత్తున నిరుద్యోగులు హాజర వ్వగా ప్రతిభ, అవగా హన సామర్థ్యం ఆధారంగా 117 మందికి ఉద్యో గాలు లభించాయి. ఉద్యోగ అవకాశాల కల్పనకై మెగా జాబ్ మేళాను వీటీజేఎం - ఐవీటీఆర్ డిగ్రీ కళాశాల ఆవర ణలో సోమవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు నిర్వహించారు. ఏడో తరగతి నుంచి పదో తరగతి వరకు చదివిన వారు, ఇంటర్, డిప్లమా, బి-ఫార్మసీ, ఎం-ఫార్మసీ, ఎంపీహెచ్‌డబ్ల్యూ నర్సింగ్, హోటల్ మేనేజ్‌మెంట్, బీఈ, బీటెక్, ఎంటెక్, బీఏ, బీఎస్సీ, బీకామ్, ఎంబీఏ, ఎంసీఏ, ఎంఎస్సీ, పోస్ట్ గ్రాడ్యుయేట్ విద్యార్హత కలిగిన నిరుద్యోగ యువత హాజరయ్యారు. 12 పైగా కంపెనీల్లో ఉద్యోగాలకు ఆయా కంపెనీల ప్రతినిధులు ఇంటర్వ్యూలు నిర్వహించారు. వాటి ఆధారంగా కంపెనీల్లో రూ.15 వేల మొదలు కొని రూ.40 వేల వరకూ జీతం లభించే ఉద్యోగాలకు 117 మందిని ఎంపిక చేసి నియామక ఉత్తర్వులు నాయ కుల చేతుల మీదుగా అందజేశారు. రాష్ట్ర సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ డైరెక్టర్ తోట పార్థసారథి మాట్లాడుతూ యువతకు ఉద్యోగ అవకాశాలు కలుగజేసేందుకు అవిశ్రాం తంగా కృషి చేస్తున్న మంత్రి నారా లోకేష్ ఆశయానికి అనుగుణంగా యువత నడుచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి కె.సంజీవ రావు, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ గొడవర్తి నాగేశ్వరరావు, పడవల మహేష్, పల్లబోతుల శ్రీనివాసరావు, కేసంనేని శ్రీఅనిత తదితరులు పాల్గొన్నారు.

మోదీ చిత్రపటానికి పాలాభిషేకం

విశాలాంధ్ర-మంగళగిరి : జీఎస్టీ తగ్గింపు ద్వారా దేశ ప్రజలకు భారీ ఉపశమనం కలిగించిన ప్రధాన మంత్రి నరేంద్ర మోదీకి కృతజ్ఞతలు తెలుపుతూ మంగళగిరి పట్టణ బీజేపీ ఆధ్వర్యంలో సోమవారం ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. పట్టణ అధ్యక్షుడు మునగాల నాగేశ్వరరావు ఆధ్వర్యంలో మోదీ చిత్రపటానికి పాలాభిషేకం చేసి, టపాసులు కాల్చి, ప్రజలకు మిఠాయిలు పంచిపెట్టారు. ఈ సందర్భంగా గుంటూరు జిల్లా ఓబీసీ అధ్యక్షులు తుల్లిమిల్లి రామకృష్ణ యాదవ్ మాట్లాడుతూ జీఎస్టీ తగ్గింపు ద్వారా దేశవ్యాప్తంగా రూ.2.5 లక్షల కోట్ల మేర ప్రజలకు ప్రయోజనం కలుగుతుందని, ఆంధ్రప్రదేశ్‌లోనే సుమారు రూ.8 వేల కోట్ల వరకు ఆదా అవుతుందని తెలిపారు. 149 వస్తువులు పూర్తిగా జీఎస్టీ నుంచి మినహాయింపు పొందగా, తాజా పాలు, పెరుగు, మజ్జిగ, కూరగాయలు, పప్పులు, పండ్లు, మాంసం, చేపలు, తాగునీరు తదితరాలు వాటిలో ఉన్నాయని వివరించారు. అలాగే సిమెంటు పన్ను 28 శాతం నుంచి 18 శాతానికి తగ్గించడం, బ్రష్లు, సబ్బులు, పేస్టులు వంటి నిత్యా వసర వస్తువుల పన్ను 12 శాతం నుంచి 5 శాతానికి తగ్గించడం సాధారణ ప్రజలకు ఊరట కలిగించిందని అన్నారు. ఈ కార్యక్రమంలో కొంగర జోగేంద్ర ప్రసాద్, పంచుమర్తి ప్రసాద్, దామర్ల దుర్గారావు, కాంద్రు భాను కిషోర్, అందే శివశంకరరావు, కోవెలకారు రాకేష్ జి, అడప వెంకట్రావు, కమల కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

రైల్వే క్లెయిమ్స్ ట్రిబ్యునల్ లోక్ అదాలత్ వినియోగించుకోవాలి

విశాలాంధ్ర - విజయవాడ (గాంధీనగర్) : రైల్వే బాధితుల పరిష్కారాలను వేగవంతం చేయడానికి సోమ,మంగళవారం సెప్టెంబర్ వరకు లోక్ అదాలత్ నిర్వహిస్తునట్లు రైల్వే క్లెయిమ్స్ ట్రిబ్యునల్, అమరావతి బెంచ్ సభ్యురాలు (న్యాయ) డాక్టర్ ఆర్. సత్యభామ తెలిపారు. రైల్వే బాధితుల పరిష్కారాలను వేగవంతం చేయడానికి లోక్ అదాలత్ నిర్వహిస్తున్నామని అమె తెలిపారు. ఈ లోక్ అదాలత్ ప్రధాన లక్ష్యం రైల్వే సంబంధిత క్లెయిమ్స్,వివాదాల సామరస్యపూర్వక పరిష్కారం కోసం ఒక వేదికను అందించడం, ప్రజలకు న్యాయం,సౌకర్యాన్ని అంది స్తారు. అదాలత్ సభ్యురాలు (న్యాయ) డాక్టర్ ఆర్. సత్యభామ మాట్లాడుతూ, గతంలో జాబితా చేయబడిన 31 ప్రతిపాదిత కేసులను ఈ లోక్ అదాలత్ సమయంలో పరిష్కారం కోసం చేపడతామని అన్నారు. దీర్ఘకాలిక వ్యాజ్యాలు లేకుండా వివాదాలను పరిష్కరిం చడానికి పార్టీలకు ఈ లోక్ అదాలత్ ఒక అద్భుతమైన అవకాశం అని కూడా ఆయన అన్నారు. లోక్ అదా లత్ కేసుల వేగవంతమైన పరిష్కారానికి సహాయపడుతుందని, చట్టపరమైన లాంఛనాలు తగ్గాయని, బాధి తులకు చాలా అనుకూలమైన వేదిక లభిస్తుందని ఆమె పేర్కొన్నారు. రైల్వే క్లెయిమ్స్ ట్రిబ్యునల్, అమరావతి నిర్వహించే లోక్ అదాలత్ సేవలను వారి రైల్వే సంబంధిత క్లెయిమ్‌లు, వివాదాలను పరిష్కరించడానికి ఉపయోగించుకోవాలని విజ్ఞప్తి చేశారు. కేసుల పరిష్కారాన్ని సులభతరం చేయడానికి ఆర్‌సిటి అమరా వతి అదనపు రిజిస్ట్రార్ రాజేంద్ర ప్రసాద్,డిప్యూటీ సిసిఎం బాలాజీ కిరణ్ విచారణలను పర్యవేక్షించారు.